Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 104 పేజీలు 8 వెల : 5 | బుధవారం 15 అక్టోబర్ 2025






## ఏపి హైకోర్టుకు ముగ్గురు

న్యాయమూర్తుల బదిలీ

## సామాన్యులకు చుక్కలు చూపుతున్న బంగారం



సంపన్నులను కలవర పెడుతున్న ధరలు

లక్షా 30 వేలు దాటేసిన బంగారు తులం ధర



కదులుతున్న బస్సులో మంటలుప్రయాణికుల్లో

## 15మంది సజీవ దహనం

బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సమీపంలోని ఆర్మీ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక కార్యక్రమాలు చేపట్టారు. అగ్నిమాపక శకటాలు రంగంలోకి దిగి చుట్టుపక్కలకు మంటలు విస్తరించకుండా వెంటనే అదుపులోనికి తెచ్చాయి.



ఇప్పుడు విశాఖకు గూగుల్ డేటా సెంటర్

సాంకేతికతలో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయి

ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో చంద్రబాబు

## ఆనాడు హైదరాబాద్‌కు

# మైక్రోసాఫ్ట్

న్యూఢిల్లీ:ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ విశాఖలో అడుగుపెడుతోందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. గతంలో హైదరాబాద్‌లో హైటెక్ సిటీని అభివృద్ధి చేశామని.. ప్రస్తుతం విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దబోతున్నట్లు చెప్పారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై దిల్లీలో ఆ సంస్థతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం సందర్భంగా 'భారత్ ఏఐ శక్తి' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, గూగుల్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆనాడు హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ తీసుకొచ్చాం. ప్రస్తుతం విశాఖకు గూగుల్‌ను తీసుకొస్తున్నాం. సాంకేతికతలో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయి. డిజిటల్ కనెక్టివిటీ, డేటా సెంటర్, ఏఐ, రియల్‌టైమ్ డేటా కలెక్షన్లు ముఖ్యమైనవి. సాంకేతికను అందిపుచ్చుకోవడంలో ఏపీ ముందుంటుంది. 2047 నాటికి వికసిత్ భారత్ మనందరి లక్ష్యం. హార్డ్ వర్క్ కాదు.. స్మార్ట్ వర్క్ నినాదం తీసుకొచ్చాం. ఐదేళ్లలో గూగుల్ 15 బిలియన్ డాలర్లు ఖర్చు పెడతామనడం సంతోషదాయకం.

విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటులో ప్రధాని మోదీ కీలకంగా వ్యవహరించారు. ప్రధానితో పాటు కేంద్రమంత్రులు అశ్వినీ వైష్ణవ్, నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపారు. గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖకు తీసుకురావడంలో లోకేశ్ ప్రధాన పాత్ర పోషించారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మాణం, ఐటీ రంగాన్ని ప్రోత్సహించా. ఐటీతో చాలా కాలంగా అనుసంధానమై ఉన్నా. రియల్‌టైమ్ డేటా, హిస్టారికల్ డేటా సాయంతో వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం కలుగుతుంది. ఇతర దేశాలతో పోలిస్తే టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారత్ ప్రత్యేకం. వన్ ఫ్యామిలీ-వన్ ఎంటప్రెన్యూర్ ద్వారా రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందిస్తాం. ప్రతి కుటుంబానికి ఏఐని దగ్గరచేసేలా ప్రయత్నిస్తాం అని చంద్రబాబు అన్నారు. ముఖ్యంగా ప్రధాని మోదీ మద్దతుతో ఇది సాధ్యం అయ్యిందన్నారు. తాను చూసిన ప్రధాన మంత్రులలో మోదీ ప్రత్యేకమన్నారు. విజినరీ, ఆలోచన తీరు, నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనను ఎవరూ అందుకోలేరని కొనియాడారు. ప్రధాని సారథ్యంలో 2047 కంటే ముందుగానే భారత దేశం అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ , కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ సహకారం అందించారన్నారు. విశాఖపట్నానికి గూగుల్ రావడంతో విప్లవాత్మక మార్పులు వస్తాయని తెలిపారు. గూగుల్ డాటా సెంటర్‌కు అన్ని విధాల ఏపీ ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఐటీ రంగంలో అనేక మార్పులు వస్తాయని... పలు కంపెనీలు గూగుల్ బాటలో పయనించే అవకాశం ఉందన్నారు. నైతిక విలువలతో కూడిన ఏఐ టెక్నాలజీ అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కొత్త ఆవిష్కరణలు అందిపుచ్చుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం ముందంజలో ఉందని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ..

ప్రధాని మోదీ దూరదృష్టితో అనేక సంస్కరణలు వచ్చాయని చెప్పారు. కొత్త ఆవిష్కరణలను అందిపుచ్చుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం ముందుందన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను 2047నాటికి సగర్వంగా నిలబెట్టాలన్న కల సాకారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతికత ప్రపంచాన్నే మార్చేస్తోందని మరో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. నైపుణ్యం ఉన్న యువతకు మరిన్ని అవకాశాలు రాబోతున్నాయన్నారు.



## తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు

అడిగిన సమాచారం ఇవ్వాల్సిందే

ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావుకు సుప్రీం ఆదేశం



## విశాఖలో గూగుల్ సెంటర్

వికసిత భారత్ లక్ష్యాలకు తార్కాణం

సుందర్ పిచాయ్‌కు మోడీ అభినందనలు

న్యూఢిల్లీ: విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తంచేశారు. ఈ సెంటర్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య జరిగిన చారిత్రక ఒప్పందంపై మోదీతో ఆ సంస్థ సీఈఓ సుందర్ పిచాయ్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయాన్ని వెల్లడిస్తూ పిచాయ్ చేసిన పోస్ట్‌కు ప్రధాని బదులిచ్చారు. గిగా సెంటర్ ఏర్పాటు వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఉంది. ఈ ఏఐ హబ్ బలమైన శక్తిగా పనిచేస్తుంది. దీనిద్వారా ప్రజలందరికీ కృత్రిమ మేధ అందుబాటులోకి రానుంది. మన డిజిటల్ ఎకానమీకి మరింత ఊపునిస్తుంది. గ్లోబల్ టెక్నాలజీ లీడర్‌గా భారత స్థానం మరింత సుస్థిరమవుతుందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తంచేశారు.

దీనికి ముందు పిచాయ్ స్పందిస్తూ.. విశాఖపట్నంలో గూగుల్ తొలి ఏఐ హబ్‌కు సంబంధించిన ప్రణాళికలను పంచు కునేందుకు ప్రధానితో మాట్లాడానని, ఈ ఏఐ హబ్ ఓ కీలక మైలురాయిగా నిలవనుందని అన్నారు.



## దేశంలో మొదటి ఎఐ సిటీగా మారనున్న విశాఖ

విప్లవాత్మక మార్పులకు ఇదో శుభసూచిక

విజినరీ లీడర్ చంద్రబాబు దూర్ధృష్టికి తార్కాణం

ఎక్స్ వేదికగా డిప్యూటి సిఎం పవన్



## 42శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మక నిర్ణయం

కాంగ్రెస్ పార్టీ బిసిలకు అండగా జివో ఇచ్చింది

హైకోర్టు జీవోను కొట్టేయడం బాధాకరం

సుప్రీంలో గట్టిగా వాదనలు వినిపంచేందుకు సిద్దం

అభిషేక్ మను సంఘ్వితో చర్చించామన్న పిసిసి చీఫ్



## బిసి రిజర్వేషన్లు అడ్డుకున్న బిజెపి, బిఆర్ఎస్

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో

తట్టుకోని బిఆర్ఎస్ మంత్రి కొండా సురేఖ మండిపాటు



## గ్రూప్-2 విజేతలకు 18న నియామక పత్రాలు

సిఎం రేవంత్ చేతుల మీదుగా శిల్పకళా వేదికలో అందచేత

ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన సిఎస్ రామకృష్ణారావు

ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి అభ్యర్థితో పాటు వారి కుటుంబ సభ్యులను సాయంత్రం 4 గంటల లోపు శిల్పకళా వేదికలో అనుమతించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.



## తుమ్మల, పొన్నంలకు మానవత్వం ఉందా

2లో..

## తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు

న్యూఢిల్లీ: తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సిట్ అధికారులు అడిగిన సమాచారం ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు ఇవ్వాల్సిందేనని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసులో క్లౌడ్, యాపిల్ క్లౌడ్ సమాచారం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. యూజర్, పాస్‌వర్డ్‌ల సమాచారం ఇవ్వాలని జస్టిస్ నాగరత్న ధర్మాసనం ఆదేశించింది. ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో సమాచారం తీసుకోవాలని సిట్‌కు సూచించింది. సమాచారం చెరిపేందుకు యత్నించినట్లు తేలితే తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని కోర్టు పేర్కొంది. ఈ మేరకు ఈ కేసులో ప్రధాన నిందితుడు, మాజీ డీఎస్పీ ప్రభాకర్ రావు సిట్ అధికారులు కోరిన సమాచారాన్ని తప్పనిసరిగా అందించాలంటూ సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ నాగరత్న ధర్మాసనం ఈ ఆదేశాలను జారీ చేస్తూ, దర్యాప్తు ప్రక్రియలో సహకరించడం ప్రతి నిందితుడి బాధ్యత. సిట్ అడిగిన వివరాలు ఇవ్వకపోవడం చట్టవిరుద్ధం, అని వ్యాఖ్యానించింది. ముఖ్యంగా ప్రభాకర్ రావు తన క్లౌడ్ డేటా, అలాగే యాపిల్ క్లౌడ్‌లో ఉన్న సమాచారం మొత్తం సిట్‌కు అందించాలన్నది కోర్టు స్పష్టం చేసింది.

అదేవిధంగా, ఆన్‌లైన్ ఖాతాలకు సంబంధించిన యూజర్‌నేమ్, పాస్‌వర్డ్‌లు కూడా సిట్ అధికారులు పొందేలా చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే, ఆ సమాచారం సేకరణ సమయంలో ఫోరెన్సిక్ నిపుణులు తప్పనిసరిగా హాజరై ఉండాలని కూడా కోర్టు సూచించింది. ఇది దర్యాప్తు పారదర్శకతను నిర్ధారించడమేనని పేర్కొంది. తద్వారా, సిట్ అధికారులు ఫోరెన్సిక్ బృందం సమక్షంలో డిజిటల్ ఆధారాలను సేకరించి దర్యాప్తును కొనసాగించవచ్చు. ప్రభాకర్ రావు లేదా ఇతర నిందితులు ఆ సమాచారాన్ని చెరిపేందుకు లేదా మార్చేందుకు యత్నించినట్లు తేలితే, ఆ అంశంపై తదుపరి కఠిన చర్యలు తీసుకుంటామని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈ తీర్పు సిట్ దర్యాప్తుకు మరింత బలం చేకూర్చనుంది. డిజిటల్ ఆధారాలు సేకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన స్పష్టమైన మార్గదర్శకాలు, ఈ కేసులో కొత్త మలుపు తిప్పే అవకాశముందని న్యాయవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక ప్రభాకర్ రావు సిట్ ఆదేశాలను పాటించి వివరాలు సమర్పిస్తారా లేదా అనే అంశం, రాబోయే రోజుల్లో ఈ కేసు దిశను నిర్ణయించనుంది.

## దేశంలో మొదటి ఎఐ సిటీగా మారనున్న విశాఖ

అమరావతి: దేశంలోని మొదటి ఎఐ సిటీగా విశాఖ మారబోతోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. సిటీ ఆఫ్ డెస్టినీ నుంచి వికసిత్ భారత్ దిశగా చారిత్రాత్మక అడుగు పడిందన్నారు.. ఈ ప్రాజెక్ట్ అందరకీ ఉపయోగపడుతుంది. యువత, రైతులు, వైద్యులు, మత్స్యకారులు, వ్యాపారవేత్తలు, మహిళలు, విద్యార్థుల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయన్నారు. విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు కోసం ఢిల్లీ వేదికగా ఏపీ ప్రభుత్వం.. గూగుల్‌తో చారిత్రక ఒప్పందం కుదుర్చుకున్న విషయం విదితమే.. ఏపీ సీఎం చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ, కమ్యూనికేషన్ల శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఏపీ మంత్రి నారా లోకేష్, గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ సహా పలువురు గూగుల్ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.. ఇక, విశాఖకు గూగుల్ డేటా సెంటర్‌పై ఎక్స్‌లో పవన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు .. గూగుల్ 15 బిలియన్ డాలర్లతో ఎఐ డేటా సెంటర్‌తో విశాఖకు ప్రపంచ స్థాయి గుర్తింపు పొందుతుందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యానికి ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వం ప్రధాన ప్రేరణగా పేర్కొన్నారు పవన్ కల్యాణ్.. విశాఖలో ఎఐ డేటా సెంటర్ సాధన సీఎం చంద్రబాబు నాలుగు దశాబ్దాల విజనరీ లీడర్‌షిప్‌కు నిదర్శనంగా అభివర్ణించిన ఆయన.. ఎఐ టెక్నాలజీతో ప్రతి పౌరుడి జీవన ప్రమాణాలు

మెరుగుపరచాలన్న లక్ష్యం.. ప్రభుత్వం మాత్రమే కాదు, ఈ కొత్త ప్రగతి యుగానికి అందరం అవసరం అన్నారు. యువత కొత్త ఆవిష్కరణలు చేయాలి, విద్యావేత్తలు పరిశోధనలో ముందుండాలి.. పౌరులు చురుకుగా పాలుపంచుకోవాలి, పరిశ్రమలు విస్తరణకు ముందుకు రావాలి. భవిష్యత్ భారత నిర్మాణంలో విశాఖ కీలక కేంద్రంగా అవతరించనుంది.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూగుల్ చారిత్రాత్మక భాగస్వామ్యం అవుతుంది.. 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి వస్తుందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఆంధప్రదేశ్, దేశం డిజిటల్ రంగంలో కొత్త దిశగా అడుగుపెట్టనుంది అన్నారు పవన్ కల్యాణ్.. వేలాది ఉద్యోగావకాశాలు సృష్టించబోతున్న డేటా సెంటర్ ప్రాజెక్ట్ ఇది.. యువతకు ఆధునిక టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్కిల్స్‌లో కొత్త అవకాశాలు వస్తాయి.. డిజిటల్ యుగంలో భారత స్థాయిని గ్లోబల్ లీడర్‌గా బలోపేతం చేసే ప్రాజెక్ట్ ఇది.. దీనిని సహకారం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, మంత్రి నారా లోకేష్, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

## గ్రూప్-2 విజేతలకు 18న నియామక పత్రాలు

హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన గ్రూప్-2 అభ్యర్థులకు ఈనెల 18 తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచే నియామక పత్రాలు అందించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. 18 తేదీ సాయంత్రం శిల్పకళా వేదికలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత ఉన్నతాధికారులతో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సి.ఎస్. సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రూప్-2 ద్వారా ఎంపికైన 783 మంది అభ్యర్థులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నియామక పత్రాలు అందిస్తారని తెలిపారు. వీరిలో దాదాపు 16 శాఖలకు చెందిన అభ్యర్థులు ఉన్నారని. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులందరినీ ఆహ్వానిస్తున్నట్లు సి.ఎస్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి అభ్యర్థితో పాటు వారి కుటుంబ సభ్యులను సాయంత్రం 4 గంటల లోపు శిల్పకళా వేదికలో అనుమతించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నియామకాల్లో అత్యధికంగా, సాధారణ పరిపాలన, రెవిన్యూ, వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్ శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన వారే అధికంగా ఉన్నందున, రెవిన్యూ,

హోం, జిఎడి కార్యదర్శులు ఈ కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సి.ఎస్. ఆదేశించారు. నియామక పత్రాలు పొందే అభ్యర్థులు రాబోయే 30 సంవత్సరాలలో సర్వీస్ లో ఉంటారు కాబట్టి, వీరికి ప్రభుత్వ సర్వీస్ పట్ల ఉన్నత భావన కలిగేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

# 42శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మక నిర్ణయం



న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చిందని.. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన జీవో చారిత్రాత్మకమని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రజల జీవితాలు బాగుపరచాలని చిత్తశుద్ధితో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. అడుగడుగున బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేకిస్తూ వచ్చినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ఎక్కడ వెనక్కు తగ్గలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృతంలో ముందుకు వెళ్లామని చెప్పారు. ఆర్డినెన్స్ తీసుకొచ్చి జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లేందుకు పూర్తి వివరాలతో హైకోర్టులో వాదించామని.. కానీ రాష్ట్ర హైకోర్టు జీవో 9 పై స్టే విధించిందన్నారు. పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్లాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం బాధాకరమని పీసీసీ చీఫ్ అన్నారు. పూర్తి వివరాలతో హైకోర్టులో వాదించినప్పటికీ స్టే విధించారని తెలిపారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం తరపున ఎస్ఎల్పీ దాఖలు చేశామని.. సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో దాదాపు గంట పాటు చర్చించినట్లు చెప్పారు. అన్ని విషయాలను కూలంకుషంగా చర్చించామన్నారు. గురువారానికి కేసు విచారణకు వచ్చే అవకాశం ఉందని అన్నారు. హైకోర్టు పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలని చెప్పిన నేపథ్యంలో బాధతో సుప్రీంకోర్టుకు వచ్చినట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టులో పిటిషన్ వేశామని.. న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నిలుపుకునే విధంగా అసెంబ్లీలో బిల్లు పెడితే అన్ని పార్టీలు మద్దతు తెలిపాయని.. కానీ ఇప్పుడు మాట మార్చి బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. 42? రిజర్వేషన్లు ఎక్కడా తగ్గకుండా ముందుకు వెళ్తున్నామని.. సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. తమది న్యాయబద్ధమైన కోరిక అని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా.. సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో మహేష్ గౌడ్ మంగళవారం భేటీ అయ్యారు. 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం తరపున గట్టి వాదనలు వినిపించాలని సీనియర్ న్యాయవాదిని మహేష్ కుమార్ గౌడ్ కోరారు.

# తుమ్మల, పొన్నంలకు మానవత్వం ఉందా



హైదరాబాద్:మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లకు మానవత్వం ఉందా? వాళ్లు మనుషులేనా? అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ఆడబిడ్డ అయిన మాగంటి సునీతను అవమానించడం ఎంతవరకు సమంజసం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గోపన్న అమర్ రహే అంటుంటే, తన భర్త గోపినాథ్‌ను గుర్తు చేసుకొని మాగంటి సునీత ఏడుస్తుంటే డ్రామా అంటారా తుమ్మల నాగేశ్వరరావు? కమ్మ సామాజిక వర్గం ఓటు వేస్తే గెలిచిన తుమ్మల, అదే వర్గానికి చెందిన నేత గోపినాథ్ సతీమణిని డ్రామా అంటారా? అని ప్రశ్నించారు. మాగంటి సునీతకు మంత్రుల వ్యాఖ్యలు తీవ్ర మనస్తాపం కలిగించాయని, వారు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రుల మాటలను తెలంగాణ ఆడబిడ్డలు గమనించాలి అని ఆయన వ్యాఖ్యానించారు.

యువకుడు..అలాగే, ప్రెస్ మీట్ సమయంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి మంత్రుల పక్కనే కూర్చున్నా, ఆడబిడ్డ అవమానింపబడుతుండగా మౌనంగా ఉన్నారని గౌడ్ విమర్శించారు. రాజీవ్ గాంధీ చనిపోయినప్పుడు పార్టీలకతీతంగా అందరం బాధ పడ్డామని, ఇప్పుడు మాగంటి సునీత తన భర్తను

గుర్తుచేసుకొని ఏడుస్తుంటే దాన్ని డ్రామా అంటారా? ఇది సిగ్గుచేటు అని మండిపడ్డారు. మాగంటి సునీత భావాలను దెబ్బతీసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లు వెంటనే క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

# సామాన్యులకు చుక్కలు చూపుతున్న బంగారం

**సంపన్నులను కలవర పెడుతున్న ధరలు**

**లక్షా 30 వేలు దాటేసిన బంగారు తులం ధర**



హైదరాబాద్:సామాన్యులను దూరం చేసుకుంటున్న బంగారం సంపన్నులనూ సవాల్ చేస్తున్నది. కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుల్ని బద్దలుకొడుతున్న పసిడి ధరలు.. రాకెట్ వేగంతో పైపైకి పరుగులు పెడుతున్నాయి. దేశీయ మార్కెట్‌లో బంగారం ధర చుక్కలు తాకుతోంది. అంతర్జాతీయ పరిణామాలు, పండగల సీజన్ కలిసొచ్చి పసిడి దూసుకెళ్తోంది. హైదరాబాద్‌లో రూ.1.30 లక్షలు దాటి పరుగులు పెడుతోంది.మంగళవారం ఒక్కరోజే తులం రేటు దాదాపు రూ.3,000 ఎగబాకింది. ఫలితంగా తులం బంగారం రూ.1.30 లక్షలు దాటి సరికొత్త రికార్డు సృష్టించింది.మార్కెట్ వర్గాల ప్రకారం.. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో తులం బంగారం ధర రూ.2,720 పెరిగి మునుపెన్నడూ లేనివిధంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,30,830కి ఎగబాకింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,21,150గా ఉంది. ఇక హైదరాబాద్‌లో కిలో వెండి ఒక్కరోజులోనే రూ.3వేలు పెరిగి రూ.1,86,200కి చేరింది. 2025లో బంగారం ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే దాదాపు 50 శాతానికి పైగానే ధరలు పెరిగాయి. 2022తో పోలిస్తే మొత్తం పెరుగుదల 140 శాతానికి చేరుకుంది. ఈ నెల 18న ధనత్రయోదశి వస్తున్నది. ఈ రోజున బంగారం, వెండి కొనుగోళ్లు శుభప్రదమని దేశంలోని మెజారిటీ ప్రజల విశ్వాసం. అయితే మార్కెట్‌లో ఇప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా.. అప్పటికల్లా రేట్లు ఇంకా పెరిగిపోవచ్చన్న అంచనాలైతే ఉన్నాయి. ఇదే జరిగితే 24 క్యారెట్ గోల్డ్ 10 గ్రాములు రూ.1,50,000

దాటిపోవచ్చన్న అభిప్రాయాలైతే బలంగా వినిపిస్తున్నాయి. అటు వెండి ధర కూడా భారీగా పెరుగుతోంది. దాదాపు రూ.2 లక్షలకు చేరువైంది. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.1,85,763గా ఉంది. అంతర్జాతీయ విపణిలోనూ పసిడి ధర విపరీతంగా పెరుగుతోంది. ఔన్సు ధర 4,115 డాలర్లుగా ఉంది. ఔన్సు వెండి ధర 51 డాలర్లు దాటింది. అమెరికా షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, యూఎస్-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు వంటి పరిణామాలతో బంగారంలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. ఈక్రమంలోనే గోల్డ్ ఈటీఎఫ్‌లకు గిరాకీ విపరీతంగా ఉంటోంది. సెప్టెంబరులో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (గోల్డ్ ఈటీఎఫ్)లో నిధుల ప్రవాహం పెరిగింది. ఆగస్టులో వీటిలోకి రూ.2,190 కోట్ల పెట్టుబడులు రాగా, సెప్టెంబరులో ఈ మొత్తం నాలుగింతలై రూ.8,363 కోట్లకు చేరింది. మరోవైపు, ధనత్రయోదశితో పాటు రాబోయే పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో పసిడికి మరింత డిమాండ్ ఉంటుందని బులియన్ వర్గాలు అంచనా వేశాయి. వచ్చే ఏడాది ఆరంభం నాటికి బంగారం ధర రూ.1.50 లక్షలకు చేరొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# హైకోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చింది

**రిజర్వేషన్ల ఆశలపై నీళ్లు చల్లారు**

**బంద్‌తో బిసిల ఆకాంక్షను వెల్లడిస్తాం**

**బంద్ పోస్టర్ ఆవిష్కరణలో ఆర్. కృష్ణయ్య**

హైదరాబాద్: బీసీల వాదన వినకుండా తెలంగాణ హైకోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చిందని బీసీ రిజర్వేషన్స్ సాధన సమితి కన్వీనర్ ఆర్.కృష్ణయ్య వ్యాఖ్యానించారు. తామంతా రిజర్వేషన్ల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో నోటికాడ బుక్క ఎత్తిపోయిందన్నారు. ఇది తమను ఎంతగానో ఆందోళనకు గురిచేసిందన్నారు. మంగళవారం బీసీ సంఘాల తెలంగాణ బంద్ పోస్టర్స్‌ని ఆర్.కృష్ణయ్య, కోదండరాం, జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంఘాల నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్స్‌పై హైకోర్టు స్టే ఇవ్వడంతో న్యాయం జరుగలేదని పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఇచ్చి బీసీల నోటికాడి ముద్దను లాక్కుందని విమర్శించారు. బీసీలకు అవమానం, అన్యాయం జరిగిందని ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

బీసీ సంఘాలు చెప్పిన అంశాలు ఆమోదయోగ్యంగా ఉన్నాయని టీజేఎస్ అధ్యక్షులు, ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. బీసీ బంద్‌కి ఇప్పటికే సంపూర్ణ మద్దతు ప్రకటించామని కోదండరాం పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్స్‌ని అడ్డుకోవద్దని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈ నెల 18వ తేదీన నిర్వహించే తెలంగాణ బంద్‌కి సంపూర్ణ మద్దతు తెలపాలని బీసీ జేఏసీ తెలంగాణ జన సమితి నేతలు తమ కార్యాలయానికి వచ్చి అడిగారని తెలిపారు. తమ కంటే ముందే బంద్‌కి కోదండరాం సంపూర్ణ మద్దతు తెలిపారని గుర్తుచేశారు. కోదండరాం మద్దతుతో బంద్ వందశాతం సక్సెస్ అయినట్లేనని చెప్పుకొచ్చారు. తెలంగాణ ఉద్యమాన్ని నడిపించిన నాయకుడు కోదండరాం అని ప్రశంసించారు. తెలంగాణలోని రెండున్నర కోట్ల బీసీల హక్కుల కోసం ఈ బంద్ చేస్తున్నట్లు వివరించారు. తెలంగాణ సమాజం ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కులగణన చేపట్టిందని గుర్తుచేశారు. తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్స్ కోసం బిల్లు రూపకల్పన చేశారని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బీసీల నోటికాడి ముద్దను కొంతమంది లాక్కుంటున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్స్ వ్యతిరేకులారా.. జనాభా దామాషా ప్రకారం తమ వాటా తమకు కావాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని సూచించారు.

## ఎపి హైకోర్టుకు ముగ్గురు న్యాయమూర్తుల బదిలీ



**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ముగ్గురు న్యాయమూర్తులు బదిలీ అయ్యారు. గుజరాత్ హైకోర్టు నుంచి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, అలహాబాద్ హైకోర్టు నుంచి జస్టిస్ దూండి రమేష్, కలకత్తా హైకోర్టు నుంచి జస్టిస్ సుబేందు సమంత బదిలీ అయ్యారు. ఈ ముగ్గురు జడ్జిలను ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని గతంలో సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. కొలీజియం సిఫారసు మేరకు ముగ్గురు న్యాయమూర్తుల బదిలీకి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తాజాగా ఆమోదం తెలపగా.. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## కదులుతున్న బస్సులో మంటలు



ప్రయాణికుల్లో 15మంది సజీవ దహనం

జైసల్మేర్: రాజస్థాన్‌లోని జైసల్మేర్ లో మంగళవారంనాడు ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తైయాట్ ప్రాంతంలోని మిలటరీ స్టేషన్ సమీపంలో కదులుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులో మంటలు చెలరేగి 15 మంది సజీవదహనమయ్యారు. మరో 25 మంది గాయపడ్డారు. బస్సులోంచి దట్టమైన పొగలు రావడంతో డ్రైవరు వెంటనే బస్సులు నిలిపివేశారు. నేషనల్ హైవేపై బస్సు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకోవడంతో కిలోమీటర్ల వరకూ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సమీపంలోని అర్మీ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక కార్యక్రమాలు చేపట్టారు. అగ్నిమాపక శకటాలు రంగంలోకి దిగి చుట్టుపక్కలకు మంటలు విస్తరించకుండా వెంటనే అదుపులోనికి తెచ్చాయి. ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా కాలిపోయింది. అయితే అగ్నిప్రమాదానికి కారణం ఏమిటనేది వెంటనే తెలియలేదు.

## రిజర్వేషన్లు బిసిల హక్కు




హైదరాబాద్:రిజర్వేషన్లు బీసీల హక్కు అని, ఎవరి దయా దాక్షిణ్యాల మీద ఇచ్చేవి కాదని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం అన్నారు. జనాభా దామాషా పద్ధతిలో వారికి రావాల్సిన హక్కు ఉందన్నారు. ఎంతోకాలంగా వారు రాజకీయంగా అవకాశాలు అందిపుచ్చుకోలేక పోతున్నారని అన్నారు. రిజర్వేషన్లు మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం చూపగలవని అన్నారు.

మానత్వపు పునాదులపై కొత్త సమాజం ఏర్పాటు చేసేందుకే అవి ఉన్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రిజర్వేషన్ల సాధన కోసం ప్రొఫెసర్ పీఎల్. విశ్వేశ్వర్‌రావు నేతృత్వంలో ఒక సబ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇతర సంఘాలతో కలిసి ఈ కమిటీ కృషి చేస్తుందన్నారు. రిజర్వేషన్ల అంశంపై కొన్ని పార్టీలు ద్వంద వైఖరి అవలంబిస్తున్నాయి. కేసులు వేసిన వ్యక్తులకు మద్దతు తెలుపుతూ.. బీసీలకు అన్యాయం జరిగిందని ప్రచారం చేస్తున్నాయి. తెజసకి రెండు నాలుకల ధోరణి లేదు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు తెలుపుతుంది. కేంద్రంపైన ఒత్తిడి తీసుకొచ్చి బీసీ బిల్లును ఆమోదించేందుకే మా పోరాటం అని అన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ర్యాలీలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహిస్తామని తెజస ఉపాధ్యక్షుడు పీఎల్. విశ్వేశ్వర్‌రావు అన్నారు. సుప్రీం కోర్టులో న్యాయపరంగా పోరాటం చేస్తామన్నారు. 16న గవర్నర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్లపై తెజస పలు తీర్మానాలు చేసింది. బీసీ సంఘాలు 18న నిర్వహించే బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించింది. మరోవైపు బీసీ రిజర్వేషన్లపై కోర్టు స్టే ఇవ్వడంలో న్యాయం లేదని ఎంపీ, బీసీ రిజర్వేషన్ల సాధన సమితి కన్వీనర్ ఆర్. కృష్ణయ్య తెలిపారు. స్టే ఇవ్వడం ద్వారా బీసీల నోటికాడ ముద్దను లాక్కుందని వ్యాఖ్యానించారు. బీసీల వాదన వినకుండా కోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చిందన్నారు.

## కుటుంబ కలహాల నేపథ్యం

**ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య**



హైదరాబాద్: హైదరాబాద్ బాలానగర్ ప్రాంతంలో విషాద ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల కారణంగా ఓ తల్లి తన ఇద్దరు చిన్నారులను హత్య చేసి, ఆ తర్వాత భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో మృతురాలును చల్లారి సాయిలక్ష్మి (27)గా గుర్తించారు. ఆమె భర్త అనిల్ కుమార్ తో కలిసి పద్మారావు నగర్ ఫేజ్-1, బాలానగర్ లో నివాసం ఉంటోంది. సాయిలక్ష్మికి ఇద్దరు కవల పిల్లలు చేతన్ కార్తికేయ, లాస్యతవల్లి ఉన్నారు. తాజాగా అందిన సమాచారం మేరకు గత కొంతకాలంగా భర్తతో వచ్చిన కుటుంబ విభేదాలు, వ్యక్తిగత సమస్యల నేపథ్యంలో తీవ్ర మనస్థాపానికి గురైన సాయిలక్ష్మి, ఆవేశంతో తన ఇద్దరు పిల్లలను చంపి అనంతరం బిల్డింగ్ పై నుంచి దూకి ప్రాణాలు తీసుకుంది. ఈ ఘటనతో ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.


# ప్రైవేట్ రంగానికి దోచిపెట్టడమెందుకు ?

ఆరోగ్యశ్రీ పేరుతో వేలకోట్లు తగులబెడుతున్న ప్రభుత్వాలు, ప్రజా వైద్యరంగాన్ని పటిష్టం చేసే ఆలోచనలు చేయడం లేదు. వైఎస్ హయంలో ఉమ్మడి ఎపిలో మొదలైన ఈ పథకం ద్వారా ప్రైవేట్ ఆస్పత్రులు బాగుపడుతున్నాయి. ఈ పథకం కింద పెట్టే ఖర్చుతో జిల్లాకో పది ఆస్పత్రులను నిర్మించవచ్చు. కానీ ప్రైవేట్ మాఫియా గుప్పిట్లో ఉన్న ప్రభుత్వాలు ఈ పథకం కోసం తగలేస్తున్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ కూడా ఇలాంటిదే. ఈ రెండు పథకాలు రాష్ట్రాల ఖజానాను కొల్లగొడుతున్నాయి. ఇకపోతే ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ కింద వైద్యాన్ని సెకండ్ గ్రేడ్ సిటిజన్ల కింద అందిస్తున్నారు. ఆస్పత్రులకు వెళ్లిన పేషెంట్లకు గౌరవప్రదమైన వైద్యం అందడం లేదు. ఈ పథకం కింద వచ్చే వారికి బిల్లులో మదింపు చేసి ఎక్కువ చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే వీరిని నాసిరకం మనుషులుగా ట్రీట్ చేస్తున్నారు.

ప్రత్యేక వార్డులు, ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. దీనిపై ఎవ్వరు కూడా అడగడం లేదు. డబ్బులు తీసుకోవడంలో ఏ మాత్రం తగ్గని ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాలు, వైద్య చికిత్సలో మాత్రం డబ్బులున్న వారికి ఓ రకంగా, ఆరోగ్యశ్రీ కింద వచ్చే పేషెంట్‌లను మరోరకంగా ట్రీట్ చేస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రాల్లో వైద్యరంగాన్ని బలోపేతం చేయాల్సింది. జనాభాకు తగ్గట్లుగా ఆస్పత్రులను నిర్మించి, ఆరోగ్యశ్రీ భారాన్ని తగ్గించాల్సిన అసవరం ఉంది. ఈ డబ్బులతో వందలాది ఆస్పత్రుల నిర్మాణం చేయవచ్చు. ఇకపోతే తెలంగాణలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను త్వరగా పూర్తి చేయాలి. ప్రైవేట్‌ను మంచి ఆస్పత్రులను అభివృద్ధి చేయాలి. ఎపిలో పిపిపి కింద ఆస్పత్రుల నిర్మాణం చేపట్టడం మంచి పరిణామం. వైద్య కళాశాలలను, ఆస్పత్రులను ఇదే తరహా అభివృద్ధి చేయాల్సిందే. దీనిపై నిజాలు తెలియకుండా విపక్ష వైసిపి నేతలు, దాని అధినేత జగన్ చేస్తున్న విమర్శల్లో అర్థం లేదు. ప్రభుత్వపరంగా వైద్య కళాశాలల ఏర్పాటుకు కేంద్రం నుంచి అనుమతులు తెస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం పేరిట ప్రైవేటుపరం చేస్తోందని వైసీపీ కొన్ని రోజులుగా విమర్శలు చేస్తోంది. పేదలకు వైద్యం అందకుండా చేస్తున్నారని విమర్శలు కురిపిస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు కావలసిన వైద్య కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేటు మోడల్‌లో నిర్మించాలన్న నిర్ణయం తీసుకునే ముందు అందుకు గల కారణాలను వివరించి ఉంటే ఈ పంచాయితీ వచ్చేది కాదు. నిజానికి వైద్య కళాశాలలు అందుబాటులో లేకపోవడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏటా వేలాదిమంది విద్యార్థులు కోట్లాది రూపాయలను విదేశాలకు తగలేస్తున్నారు. అలా కాకుండా ఇక్కడే నాణ్యమైన వైద్యవిద్యను అందించగలిగితే డబ్బు వృధాకాదు. అంతేకాకుండా వాటికి అనుబంధంగా ఆస్పత్రులను బలోపేతం చేయాల్సి ఉంది. ఫ్యాకల్టీని, వైద్యులను కూడా సిద్ధం చేసుకోవాలి. ఈ రకమైన ప్రయత్నాలు కూడా ప్రత్యామ్నాయంగా సాగాలి. వైద్య విద్యను బోధించే సిబ్బందిని సమకూర్చుకోకుండా కళాశాలలను ఏర్పాటు చేయడం సమర్థనీయం కూడా కాదు. సంక్షేమం పేరిట దుబారా ఖర్చు చేస్తున్న తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విద్యా,వైద్యరంగాలను బలోపేతం చేసేందుకు అధిక నిధులను వెచ్చించాలి.. బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వాలు భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రజలు ప్రైవేటు రంగం వైపే ఆకర్షితులవుతున్నారు. దీనిని కూడా ప్రభుత్వాలు అధ్యయనం చేయాలి. ప్రైవేటు రంగంలోని ఆస్పత్రుల్లో వైద్యంపైనే ప్రజలు మక్కువ పడుతున్నారు. గాంధృ, ఉస్మానియా, వరంగల్ ఎంజిఎం లాంటి ఆస్పత్రలకు వెళ్లాలనుకోవడం లేదు. గుంటూరు, విజయవాడ, తిరుపతిల్లో కూడా ఇలాంటి దుస్థితి ఉంది. ఈ ఆస్పత్రులను ముందుగా బలోపేతం చేయాలి. ప్రవైట్ ఆస్పత్రలుకు పోటీగా అన్నిరకాల వైద్యసేవలు, వైద్య సర్వీసులను అందుబాటులోకి తీసుకుని రావాలి. ప్రైవేట్ గుత్తాధిపత్యానికి తావు లేకుండా చేయగలిగితే పోటీతత్వం వల్ల ప్రజలకు మేలే జరుగుతుంది. విద్యా రంగంలో కూడా పోటీతత్వం పెరిగింది. తమ పిల్లలను పేరొందిన ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్చడానికే ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు బడుగు బలహీన వర్గాల పిల్లలకే పరిమితం అవుతున్నాయి. నిజానికి ప్రైవేటు రంగంలోని పాఠశాలల్లో ఇరుకు గదుల్లో చదువు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు విశాలమైన క్రీడా మైదానాలు కూడా ఉన్నా ఆసక్తి కనిపించడం లేదు. అధిక జీతాలతో ఉపాధ్యాయులను నియమిస్తున్నా..కూడా ఫలితం కానరావడం లేదు. ఈ క్రమంలో ప్రైవేట్‌లో చదివే విద్యార్థులకు ఇంజనీరింగ్‌లో ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వడం న్యాయనం కాదు. దీనిపై ప్రభుత్వాలు ఆలోచనలు చేయాలి. విద్య, వైద్య రంగాలపై వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ ఫలితం మాత్రం అంతంత మాత్రంగానే ఉంటోంది. అంటే సక్రమంగా నిధుల వెచ్చింపు జరగడం లేదని గుర్తించాలి. అరకొర సౌకర్యాలే ఉన్నప్పటికీ ప్రైవేటు విద్యా సంస్థల వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. మెరుగైన విద్య, వైద్యం ఇతర సౌకర్యాల కోసం ప్రభుత్వాలు తమ ప్రాధాన్యం పెంచాలి. విద్య, వైద్య రంగాలలో కూడా ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు రంగంతో పోటీ పడేలా చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పోతోందనడానికి ప్రైవేట్ పోటీ పెరగడమే. ప్రభుత్వ రంగంలో ఆస్పత్రులను తీర్చిదిద్దితే ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు అవసరం ఉండదు. ప్రభుత్వ విద్యా,వైద్యరంగంలో జవాబుదారీతనం కూడా తీసుకుని రావాలి. వీటిపై అజమాయిషీ కూడా పెంచాలి. అరకొర సౌకర్యాలు ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు కూడా బాగానే నడుస్తున్నాయి. అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆస్పత్రులు ప్రజల్లో విశ్వాసం కల్పించలేకపోతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం సిబ్బందిలో జవాబుదారీతనం లేకపోవడమే. ఆస్పత్రులైనా, కళాశాలలైనా నిపుణులైన ఫ్యాకల్టీ ఉన్నప్పుడే వాటిపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది. పేరొందిన డాక్టర్లతోనే వైద్యం చేయించుకోవాలని ఎవరైనా కోరుకుంటారు. అలానే సరైన ఫ్యాకల్టీ ఉన్న వైద్య కళాశాలల్లో చేరడానికే విద్యార్థులు ఆసక్తి చూపుతారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకువచ్చిన ఫీజుల చెల్లింపు పథకం ఫలితంగా ఇంజనీరింగ్ కళాశాలలు పుట్టగొడుగుల్లా ఏర్పడ్డాయి. ఫలితంగా రెండు రకాలుగా నష్టం జరిగింది. ఇంజనీరింగ్ విద్య నాణ్యత దెబ్బతింది. ఆయా కళాశాలలు మూతపడ్డాయి. నాణ్యతలేని ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన వేల, లక్షల మంది ఇంజనీరింగ్ పట్టభద్రులు నిరుద్యోగులుగా మన కళ్ల ముందే కనిపిస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యతో పోలిస్తే వైద్య విద్యలో ఫ్యాకల్టీ ప్రాధాన్యం అధికంగా ఉంటుంది. ఇదే విషయాన్ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి పదేపదే చెబుతున్నారు. దీనిని సాకారం చేయాల్సి ఉంది.

# ముగ్గురు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారే...

ఆంధ్రప్రదేశ్: జనాభా పెరుగుదల తగ్గడంపై సీఎం చంద్రబాబు నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఒకప్పుడు జనాభా నియంత్రణ గురించి మాట్లాడిన ఆయన, ఇప్పుడు జనాభా నిర్వహణ అవసరమని అన్నారు. ముగ్గురు కంటే ఎక్కువ పిల్లలు ఉన్నవారే నిజమైన దేశభక్తులని, జనాభా పెంచేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తుందని తెలిపారు. ప్రత్యుత్పత్తి రేటు 2.1గా ఉంటేనే జనాభా స్థిరంగా ఉంటుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.



ఆంధ్రప్రదేశ్‌లో జనాభా పెరుగుదల తగ్గడం గురించి సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ జనాభా గురించి పలు సందర్భాలలో ప్రస్తావిస్తూ వస్తున్న చంద్రబాబు.. తాజాగా ప్రపంచ జనాభా దినోత్సవం సందర్బంగా నిర్వహించిన కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో తానే జనాభా నియంత్రణ గురించి మాట్లాడానన్న చంద్రబాబు. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయని అన్నారు. జనాభా నియంత్రణ కాదు.. నిర్వహణ అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలోనే చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. "ఒకరు ఉంటే ముద్దు, ఇద్దరు ఉంటే ఫర్వాలేదు.. ముగ్గురు వద్దు గతంలో చెప్పా. ఇప్పుడేమంటున్నానంటే ముగ్గురు కంటే ఎక్కువ మంది ఉంటే పిల్లలు ఉన్నవారే నిజమైన దేశభక్తులు. సమాజాన్ని కాపాడే వ్యక్తులు. అలాంటి వారిని గౌరవిద్దాం." అంటూ కీలక వ్యాఖ్యలు చేసారు.

మారుతున్న పరిస్థితుల దృష్ట్యా ఇప్పుడు జనాభా అనేది ఆస్తిగా మారిపోయిందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు అధిక జనాభా ఉన్న దేశాలను చులకనగా చూసే పరిస్థితి ఉండేదని.. కానీ ఇప్పుడు జనాభా భారం కాదు ఆస్తి అని చంద్రబాబు అన్నారు. గురజాడ చెప్పిన విధంగా దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ అనే స్ఫూర్తితో ముందుకు సాగాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులని గతంలో చట్టం తెచ్చామని.. కానీ ఇప్పుడు ఆ చట్టాన్ని కూడా మార్పులు చేసినట్లు గుర్తు చేశారు. ఏపీలో ప్రత్యుత్పత్తి రేటు 1.8గా ఉండటంపై ఆందోళన వ్యక్తం చేసిన చంద్రబాబు.. ప్రత్యుత్పత్తి రేటు 2.1గా ఉంటేనే జనాభా పెరుగుదల స్థిరంగా ఉంటుందన్నారు.

మరోవైపు జనాభా పెంచేందుకు ఏపీ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. పిల్లలను కనేందుకు ప్రోత్సాహకాలు ఇస్తామని కూడా సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ జనాభా 2026 నాటికి 5.38 కోట్లకు, అలాగే 2051 నాటికి 5.41 కోట్లకు చేరుకుంటుందని అంచనా. జనాభా పెరుగుదల లేకపోతే యువత తగ్గిపోతారని.. వృద్ధుల సంఖ్య పెరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అలాగే జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనే వాదనలు కూడా ఉన్నాయి. వీటిన్నింటిని దృష్టిలో పెట్టుకుని పిల్లలను కనాలని చంద్రబాబు దంపతులకు సూచిస్తున్నారు. ఇందుకోసం అనేక చర్యలు తీసుకుంటున్నారు.

# అన్నదాత సుఖీభవ జాబితాలో పేరు లేదా..

ఆంధ్రప్రదేశ్:అన్నదాత సుఖీభవ పథకం తొలి విడుత నిధులను ఏపీ ప్రభుత్వం ఈ నెలలోనే విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాను రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శిస్తున్నారు. ఆన్ లైన్‌లోనూ అన్నదాత సుఖీభవ పథకం స్టేటస్ చెక్ చేసుకునే అవకాశం కల్పించారు. అయితే అన్నదాత సుఖీభవ పథకం పొందే క్రమంలో ఎదురయ్యే కొన్ని సమస్యలు, వాటి పరిష్కారాలను ఇక్కడ చూద్దాం.

రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయనున్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎం కిసాన్ యోజనతో కలిపి అన్నదాత సుఖీభవ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనుంది. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ యోజన కింద అర్హులైన రైతులకు ఏటా మూడు విడతల్లో రూ.20000 అందించనుంది. ఇందులో భాగంగా జూలై నెలలోనే అన్నదాత సుఖీభవ పథకం తొలి విడత నిధులు రూ.7000ను ప్రభుత్వం రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనుంది. అర్హులైన రైతుల వివరాలను ఇప్పటికే రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శిస్తున్నారు. అలాగే మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్, అన్నదాత సుఖీభవ పోర్టల్‌లోనూ ఆధార్ కార్డు ద్వారా అన్నదాత సుఖీభవ పథకం స్టేటస్ చెక్ చేసుకోవచ్చు.

అయితే అర్హత ఉన్నా కూడా అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితాలో పేరు లేని రైతుల కోసం ఏపీ ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఇలాంటి వారు జూలై 13వ తేదీ వరకూ సమీపం లోని రైతు సేవా కేంద్రాల ద్వారా అన్నదాత సుఖీభవ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వారి పత్రాలను అధికారులు పరిశీలించి సరిచేస్తా రు. అర్హులైన వారికి అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో గ్రీవెన్స్ ద్వారా సమస్యలను పరిష్కరిస్తారు మరోవైపు ఏపీ ప్రభు త్వం కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి అందిస్తున్న సంగతి తెలిసిందే.



ఎస్సీ, ఎస్టీ, బీసీ కౌలు రైతులు అన్నదాత సుఖీభవ పథకం పొందాలంటే కౌలు గుర్తింపుకార్డులు పొందాల్సి ఉంటుంది. అలాగే ఖరీఫ్‌లో ఈ - పంటలకో నమోదు చేయించుకోవాలి. దేవాదాయ భూములు సాగు చేస్తున్నవారు, డి- పట్టాదారులు, అసైన్డ్ భూములు కలిగినవారు, ఇనాం భూములు సాగుచేసేవారు కూడా పథకానికి అర్హులు. మరోవైపు కుటుంబంలో ఒకరికి మాత్రమే అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు అందిస్తారు. ఒకవేళ కుటుంబం నుంచి విడిగా ఉంటే గ్రామ, వార్డు సచివాలయంలో హౌస్ హోల్డ్ సర్వేలో వేరు చేయించుకోవాలని అధికారులు చెప్తున్నారు. ఆ తర్వాత రైతు సేవా కేంద్రంలోని గ్రీవెన్స్ మ్యాడ్యూల్‌లో దరఖాస్తు చేసుకుంటే అన్నదాత సుఖీభవ లబ్ధి చేకూరుతుంది.

ఇక వెబ్‌ల్యాండ్‌లో ఆధార్ నంబర్ తప్పుగా లింక్ చేసి ఉన్న రైతులు.. రెవెన్యూ సిబ్బందిని సంప్రదించడం ద్వారా సరైన ఆధార్ నంబర్ లింక్ చేసుకోవాలి. ఒక వేళ వెబ్ ల్యాండ్‌లో భూమికి ఆధార్ అనుసంధానం కాకపోయి ఉంటే.. సంబంధిత వీఆర్వో, ఎమ్మార్వో ద్వారా సరిచేయించుకోవాలి. రెవెన్యూ అధికారులను సంప్రదించి వెబ్ ల్యాండ్ రికార్డులతో తమ ఆధార్ కార్డును అనుసంధానం చేసుకుంటే అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి వర్తిస్తుందని అదికారులు చెప్తున్నారు. అలాగే ఇంకా ఏవైనా వివరాలు కావాలంటే ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ 155251 నంబర్‌కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని అధికారులు చెప్తున్నారు.

# డ్వాక్రా మహిళలకు గుడ్‌న్యూస్..



ఆంధ్రప్రదేశ్: ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, రాయితీపై ఎలక్ట్రిక్ వాహనాలను అందిస్తోంది. మెప్మా సహకారంతో ర్యాపిడోతో అనుసంధానం చేసి, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఇప్పటికే విజయవాడ, విశాఖపట్నంలో 400 మందికి పైగా లబ్ధి పొందారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న డ్వాక్రా మహిళలకు ఈ-బైక్‌లు, ఈ-ఆటోలు అందజేస్తున్నారు. ఈ పథకం ద్వారా మహిళలు రోజుకు రూ.1000 నుంచి రూ.1500 వరకు సంపాదిస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. మహిళలకు సబ్సిడీతో తక్కువ ధరకే ఎలక్ట్రిక్ వాహనాలు అందిస్తున్నారు. మెప్మాతో ర్యాపిడోను అనుసంధానం చేసి పథకాన్ని అమలు చేస్తున్నారు. బైక్‌లు, ఆటోలు నడుపుతూ ఉపాధి పొందుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం కొందరికి స్కూటీలు, మరికొందరికి ఆటోలు పంపిణీ చేసింది. ఈ పైలెట్ ప్రాజెక్ట్ ప్రస్తుతం ప్రధాన నగరాల్లో నడుస్తోంది. ఉదాహరణకు తీసుకుంటే.. విజయవాడ, విశాఖపట్నంలో 400 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి మరింతమందిని ర్యాపిడో నెట్‌వర్క్‌లో చేర్చాలని భావిస్తున్నారు. మెప్మాతో ర్యాపిడో అనుసంధానం చేయడంతో.. డ్వాక్రా మహిళలకు ర్యాపిడో యాప్ వాడకంపై శిక్షణ ఇస్తున్నారు.

డ్వాక్రా గ్రూప్ ద్వారా వాహనాలు తీసుకుంటే కనుక.. స్కూటీ, బైక్‌కు రూ.12 వేలు, ఆటో తీసుకుంటే రూ.30 వేల సబ్సిడీ ఇస్తారు. ర్యాపిడో ద్వారా అదనపు ఆదాయం వస్తుంది.. నెలకు 150 రైడ్స్ చేస్తే రూ.వెయ్యి, 300 రైడ్స్ చేస్తే రూ.2వేలు వ్యాలెట్‌లో జమ అవుతాయి. వీటితో పాటుగా పలు సదుపాయాలు, మంచి ఆదాయం పొందవచ్చు. ఈ పథకం ద్వారా రోజుకు రూ.1000 నుంచి రూ.1500 వరకు సంపాదిస్తున్నామంటున్నారు లబ్ధిదారులైన మహిళలు. ఈ ఉపాధి మా తమ కుటుంబాన్ని ఆదుకుంటుందని.. పిల్లల చదువులు, ఇతర ఇంటి అవసరాలకు ఆదాయంగా మారిందంటున్నారు. తమ స్వయం ఉపాధికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతోందని మహిళలు చెబుతున్నారు. వినియోగదారులు ఒక్క క్లిక్‌తో యాప్‌లో ర్యాపిడోలో బైక్, ఆటోలను బుక్ చేసుకుంటే చాలు నిమిషాల్లో వస్తున్నారు.. ప్రయాణికులను ఎక్కించుకుని వారి గమ్యస్థానాలకు చేర్చుతున్నారు. డ్వాక్రా గ్రూపు మహిళల్లో డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారికి ఈ-బైక్‌లు, ఈ-ఆటోలు సమకూరుస్తున్నారు. వీరిని ర్యాపిడోతో అనుసంధానం చేశారు. ఈ నిర్ణయం ద్వారా మహిళల ఉపాధికి అవకాశం దొరికింది. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలుతో పాటు పలు చోట్ల ఈ-బైక్‌లు, ఈ-ఆటోలు సబ్సిడీపై అందజేశారు.

# తిరుమల తరహాలోనే ఆ ఆలయంలో కూడా..

తిరుమల: తిరుమల తరహాలో ఒంటిమిట్ట రామా లయంలోనూ ఆర్జిత సేవలు ప్రారంభం కానున్నా యి. శ్రీరామ పట్టాభిషేకం, తెప్పోత్సవం వంటి ఉత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించను న్నారు. ప్రతి నెలా పునర్వసు నక్షత్రాన పుత్రకామేష్టి సేవ జరగనుంది. అంతేకాదు, భక్తులకు అన్నప్రసాదం కూడా అందిం చనున్నారు. మరిన్ని ఆలయాల్లోనూ ఈ సదుపాయం కల్పించేందుకు టీటీడీ ప్రయత్నాలు చేస్తోంది. ఈ మార్పులు భక్తులకు మరింత ఆధ్యాత్మిక అనుభూతిని అందించనున్నాయి. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.



తిరుమల తరహాలో మరో ఆలయంలో కూడా ఆర్జిత సేవలు నిర్వహించనున్నారు. ఈ మేరకు టీటీడీ ఉత్తర్వులు ఇచ్చింది. కడప జిల్లాలో కొలువై ఉన్న ఒంటిమిట్ట కోదండ రామాలయంలో కూడా ఇకపై ఆర్జిత సేవలు ఉంటాయి. ఈ మేరకు అనుమతులిస్తూ టీటీడీ డిప్యూటీ ఈవో ఏ ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. 'శ్రీరామ పట్టాభిషేకం క్రతువును శ్రావణ మాసంలో తదియ, చవితి, పంచమి, మాఘ మాసంలో మృగశిర, ఆరుద్ర, పునర్వసు నక్షత్రం సందర్భం గా ముహూర్తాన్ని ఖరారు చేసి శాస్త్రోక్తంగా నిర్వహించాలి. తెప్పోత్సవాన్ని వైశాఖ మాసంలో దశమి, ఏకాదశి, ద్వాదశి తిథుల్లో చేపట్టాలి. జ్యేష్ఠ మాసంలో మూడు రోజులపాటు సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులకు జ్యేష్టాభిషేకం (స్నపన తిరుమం జనం) నిర్వహించాలి. ధనుర్మాసంలో అధ్యయ నోత్సవాల్లో భాగంగా రోజూ వేదపండితుల ద్వారా దివ్య ప్రబంధం పారాయణం చేయాలి. ప్రతినెలా పునర్వసు నక్షత్రం వేళ సంతాన భాగ్యం కోసం పుత్రకామేష్టి ఆర్జిత సేవను ప్రారంభించాలి' అని పేర్కొన్నారు.

జులై నెలలో ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో విశేష ఉత్సవాలు ఇలా ఉన్నాయి. 'జులై 10న పౌర్ణమి సందర్భంగా ఉదయం 9.30 గం.లకు శ్రీ సీతారాముల కల్యాణోత్సవం. జులై నెలలో దేవుని కడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష ఉత్సవాలు. జులై13న శ్రవణా నక్షత్రంగా ఉ. 6.30 స్నపనం, ఉదయం. 10.గం.లకు కళ్యాణోత్సవం, సా.5. శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారికి గ్రామోత్సవం. జులై 24న పునర్వసు నక్షత్రం సందర్భంగా సా.3.30 గం.లకు స్నపనం, సా.5.గల. గ్రామోత్సవం. జులై 28న పుబ్బ నక్షత్రం సందర్భంగా ఆండాళ్ అమ్మవారికి సా.3.30 గం.లకు స్నపనం, సా. 05.00 గం.లకు గ్రామోత్సవం. జులై 29న ఉత్తర నక్షత్రం సందర్భంగా శ్రీ పద్మావతి అమ్మవారికి సా. 3.30 గం.లకు స్నపనం, సా.5 గం.లకు ప్రాకారోత్సవం. ప్రతి శనివారం సా. 05 గం.లకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారికి గ్రామోత్సవం' నిర్వహిస్తారని టీటీడీ తెలిపింది.

అంతేకాదు ఇటీవల ఒంటిమిట్ట కోదండ రామాలయంలో బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరైన సందర్భంలో మరో కీలక ప్రకటన చేశారు. ఒంటిమిట్ట రామాలయంలో కూడా భక్తులకు తిరుమల తరహాలో అన్నప్రసాదం అందించాలని సూచించారు. ఈ అంశంపై టీటీడీ పాలకమండలి ఛైర్మన్ బీఆర్ నాయుడు కూడా స్పందించారు.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఒంటిమిట్ట ఆలయంలో కూడా అన్నప్రసాదం ప్రారంభిస్తామన్నారు.. ఈమేరకు ఆ దిశగా టీటీడీ కసరత్తు చేస్తోంది. తిరుమల, ఒంటిమిట్ట మాత్రమే కాదు రాష్ట్రవ్యాప్తంగా మరికొన్ని ఆలయాల్లో కూడా తిరుమల తరహాలోనే అన్నప్రసాదం అమలు చేయాలని భావిస్తున్నారు.

# ప్రపంచంలోనే అద్భుత నగరిగా అమరావతి

**భవిష్యత్ తరాలకు ఆదర్శంగా రాజధాని**
**రాజధాని రైతుల త్యాగాన్ని మరువలేం**
**వారు పడ్డ కాష్టాలన్నీ గుర్తున్నాయి**
**వారి సమస్యలను పరిస్కరించే బాధ్యత మాదే**
**సిఆర్‌డిఎ కార్యాలయ ప్రారంభోత్సవంలో సిఎం చంద్రబాబు**

అమరావతి: దేశంలోనే కాకుండా ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అత్యద్భుత నరగంగా అమరావతి రాజధాని నిర్మాణం కాబోతున్నదని సిఎం చంద్రబాబు అన్నారు. దేవతల రాజధాని అమరావతి ఎలా ఉంటుందో కానీ, మన రాజధాని అమరావతి అంతకుమించి ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇది కేవలం రాజధాని మాత్రమే కాదని, మనభవిష్యత్ ఆశలకు తార్కాణంగా ఉంటుందన్నారు. అలాగే రాజధాని అమరావతి ప్రాంత రైతుల త్యాగాలను ఎప్పటికీ మరువనని సీఎం చంద్రబాబు అన్నారు. భూములు ఇచ్చిన రైతుల అవస్థలు చూశానని.. రోడ్డెక్కి ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. రాజధాని ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అమరావతిలో సీఆర్డీఏ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించిన అనంతరం సీఎం మాట్లాడారు. ఇవాళ చాలా ఆనందంగా ఉంది. మొదటిగా సీఆర్డీఏ భవనం ప్రారంభమైంది. తొలిసారి ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చిన చరిత్ర అమరావతి రైతులది. రాబోయే రోజుల్లో ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు వస్తాయి. రాష్ట్ర విభజన జరిగినప్పుడు రాజధాని కూడా లేని పరిస్థితిలో విభజన జరిగింది. రాజధాని ఎక్కడో చెప్పకుండా అప్పటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన చేసింది. రాష్ట్ర భవిష్యత్తుకు ఉపయోగపడేలా.. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా నిర్మించాలని ఆనాడు నిర్ణయం తీసుకున్నాం. విజయవాడ-గుంటూరు మధ్యలో రాజధాని ఉంటే బాగుంటుందని నిర్ణయించాం. అప్పటికే ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ తయారు చేశాం. రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. ప్రపంచ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో భూసమీకరణ జరిగింది ఒక్క అమరావతిలోనే. గతంలో హైటెక్ సిటీ నిర్మించినప్పుడు నా విజన్ చెబితే అవహేళన చేశారు. హైదరాబాద్‌లో 5 వేల ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మించాం. ఎయిర్‌పోర్టుకు భూమి ఇవ్వాలని ఆనాడు కోరితే రైతులు వెంటనే ఇచ్చారు. అక్కడ భూములు కొన్నవారు బ్రహ్మాండంగా బాగుపడ్డారని చంద్రబాబు అన్నారు. ఇప్పుడు ఇక్కడి రైతులు కూడా బాగుపడతారని హామీ ఇస్తున్నానని అన్నారు. రాజధాని రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ముగ్గురికి చంద్రబాబు బాధ్యతలు అప్పగించారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌కు అప్పగిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఏ సమస్య ఉన్నా ఈ ముగ్గురు నేతలతో చెప్పి పరిష్కరించుకోవాలని సూచించారు. నేతలు సైతం తరచూ రైతులతో సమావేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు.రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి రాజధాని లేకుండా రాష్ట్రం ఏర్పడిందన్నారు. రాజధాని ఎక్కడ పెట్టాలో నిర్ణయించడానికి నాడు కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం కమిటీ వేసిందని తెలిపారు. రాజధాని ఎక్కడ పెట్టాలనే అంశాన్ని కూడా చెప్పకుండా విభజన చేశారని.. రాజధాని కోసం జాగా కూడా లేని పరిస్థితుల్లో రాష్ట్ర విభజన చేశారని అన్నారు. రాజధాని విషయంలో నాటి యూపీఏ ప్రభుత్వం లేనిపోని పంచాయితీ పెట్టిందని విమర్శించారు.

రాష్ట్రం మధ్యలో రాజధాని పెడితే అందరికీ బాగుంటుందని ఇక్కడ ఏర్పాటు చేశామని చెప్పారు. బెస్ట్ రాజధాని నిర్మిస్తున్నామని... గ్రీన్ ఫీల్డ్ రాజధాని నిర్మిస్తున్నామని వెల్లడించారు. రాజధాని నిర్మాణానికి భూమి కావాలని.. ప్రణాళికలకు అనుగుణంగా రాజధాని నిర్మించగలరా అని అనుమానపడ్డారని అన్నారు. సైబరాబాద్ నిర్మించిన అనుభవంతో అమరావతి నిర్మాణం ప్రారంభించామని.. భూమి కోసం ఎదురు చూస్తున్న సమయంలో అమరావతి రైతులు తనకు దారి చూపారని సీఎం వెల్లడించారు. రైతులు ఐదు సంవత్సరాలు ఇబ్బందులు పడ్డారని.. రాజధాని వేశ్యల ప్రాంతమని మాట్లాడారని.. ఎడారి, స్మశానం అన్నారని మండిపడ్డారు. ఇంత మంచి ప్రాంతం ఎక్కడా ఉండదన్నారు. 30, 40 లక్షల ఎకరాలు సాగు చేసే నది కృష్ణా నది ఇక్కడ పారుతోందని, ప్రపంచంలో ఎక్కడా లేని సిటీ అమరావతి అని తెలిపారు. ఇక్కడ గ్రీనరీ అద్భుతంగా వస్తుందని.. ఇక్కడ బ్లూ , గ్రీన్ సిటీగా అమరావతి ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గతంలో జరిగిన తప్పుకు మీరు, నేను, రాష్ట్ర ప్రజలు ఎంత అనుభవించారో చూశారు. ఇకపై ఎన్‌డీఏ ప్రభుత్వం శాశ్వతంగా ఉండాలి.

ఉత్తేజిత దినపత్రిక

# మహా పూర్ణాహుతితో ముగిసిన చంద్రగిరి శ్రీ కోదండరామస్వామివారి పవిత్రోత్సవాలు





**తిరుపతి,ఉత్తేజిత ప్రతినిధి, అక్టోబర్ 14.**

చంద్రగిరి శ్రీ కోదండరామస్వామివారి ఆలయ పవిత్రోత్సవాలు మంగళవారం ఉదయం మహాపూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా స్వామివారిని ఉదయం సుప్రభాతంతో మేల్కొలిపి, సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం 6 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు చతుష్టార్చన, మహాపూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ, పవిత్ర వితరణతో పవిత్రోత్సవాలు ముగిశాయి. సాయంత్రం 5 గంటలకు శ్రీ కోదండరామ స్వామి, శ్రీ సీతాదేవి, శ్రీ లక్ష్మణ స్వామి వార్లతో వీధి ఉత్సవం జరుగనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శ్రీమతి వరలక్ష్మీ, సూపరిండెంట్ శ్రీ జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ ముని హరిబాబు, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 30న శ్రీవారి ఆలయంలో పుష్పయాగం



**తిరుమల, ఉత్తేజిత ప్రతినిధి, అక్టోబర్ 14.**

తిరుమల శ్రీవారి ఆలయంలో అక్టోబర్ 30న గురువారం పుష్పయాగ మహోత్సవం శాస్త్రోక్తంగా జరుగనుంది. అక్టోబర్ 29న బుధవారం రాత్రి 8 నుండి 9 గంటల వరకు పుష్పయాగానికి అంకురార్పణ నిర్వహించనున్నారు. పుష్పయాగం రోజున ఆలయంలో రెండవ అర్చన, రెండవ గంట, నైవేద్యం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి ఉత్సవర్లను సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణ మండపానికి వేంచేపు చేసి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో వేడుకగా పుష్పయాగం నిర్వహిస్తారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ తరువాత ఆలయ నాలుగు మాడ వీధుల్లో శ్రీమలయప్పస్వామివారు భక్తులకు దర్శనమిస్తారు.

**ఆర్జిత సేవలు రద్దు**

అక్టోబర్ 29న అంకురార్పణ కారణంగా సాయంత్రం సహస్రదీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది. అక్టోబర్ 30 పుష్పయాగం రోజున తిరుప్పావడ సేవ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవ సేవలు రద్దయ్యాయి. తోమాల, అర్చన సేవలు ఏకాంతంగా నిర్వహిస్తారు.

## తిరుపతిలో జోనింగ్ నిబంధనలు - శక్తి సామర్థ్య అధ్యయనం పై ఈ నెల 28 న వర్క్ షాప్.

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, అక్టోబర్ 14.**



తిరుపతిలో జోనింగ్ నిబంధనలు – శక్తి సామర్థ్య అధ్యయనం పై ఈ నెల 28 న కచ్చపి ఆడిటోరియంలో అవగాహన సదస్సు మరియు వర్క్ షాప్ ను నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. అమృత్ పథకం క్రింద విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ బృందం నగరంలో నిర్వహించిన పైలెట్ ప్రాజెక్ట్ సర్వే వివరాలను మంగళవారం కమిషనర్ కు వివరించారు. కాగా కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖకు చెందిన జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థ ఎస్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (%ూూూ%), విజయవాడ "ఎనర్జీ ఎఫిషెన్సీ కన్సిడరేషన్స్ ఇన్ జోనింగ్ రెగ్యులేషన్స్ %–% ఎ స్టడీ ఆఫ్ తిరుపతి" అనే ప్రాజెక్టును చేపట్టింది. ఈ ప్రాజెక్టు అమృత్ సెంటర్ ఆఫ్ అర్బన్ ప్లానింగ్ ఫర్ కెపాసిటీ బిల్డింగ్ ఆధ్వర్యంలో, గృహనిర్మాణ%–%నగర వ్యవహారాల మంత్రిత్వశాఖ (MoHUA) నిధులతో అమృత్ కార్యక్రమం కింద కొనసాగుతుంది. ఈ అధ్యయనం ద్వారా తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో జోనింగ్ నియమాలు విద్యుత్ శక్తి వినియోగంపై ఎలా ప్రభావం చూపుతున్నాయో విశ్లేషించడం, అలాగే తగిన సవరణలు, ప్రణాళికాత్మక జోక్యాల ద్వారా విద్యుత్ శక్తి వినియోగాన్ని తగ్గించే మార్గాలను గుర్తించడం లక్ష్యంగా ఉంది. ఈ ఫలితాలు భవిష్యత్తు పట్టణ ప్రణాళిక విధానాలకు మార్గదర్శకంగా నిలుస్తాయి. SPA బృందం భూ సర్వేలు, గణాంకపరమైన విశ్లేషణలు, సాఫ్ట్‌వేర్ ఆధారిత అధ్యయనాల ద్వారా తుది సూచనలను సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టు ఫలితాలపై అవగాహన సదస్సు మరియు వర్క్ షాప్ (Dissemination Workshop) అక్టోబర్ 28న కచ్చపి ఆడిటోరియం, తిరుపతిలో జరుగనుందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (SPA), విజయవాడ అడిషనల్ ప్రొఫెసర్ జనమేజయ్, డిప్యూటీ సిటీ ప్లానర్ మహబూబ్ ఖాన్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మూర్తి పాల్గొన్నారు.

## ఇబ్రహీం మృతి పార్టీకి తీరని లోటు: సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి మోహన్

**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ అక్టోబర్ 14**



సి. బెళగల్ మండల సిపిఎం పార్టీ కార్యదర్శి మరియు సిఐటియు మండల కన్వీనర్ గా పనిచేస్తున్న ఎస్.ఇబ్రహీం గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. వి నారాయణ, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాధాకృష్ణ, అంజి బాబు, సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి మోహన్ ఇబ్రహీం పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇబ్రహీం కుటుంబాన్ని ఓదార్చి,అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఇబ్రహీం సి.బెళగల్ మండలంలో హమాలి సంఘం కార్యదర్శిగా పనిచేస్తూ, 2010 నుండి సిపిఎం పార్టీ సభ్యుడుగా, మండల శాఖ కార్యదర్శిగా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ వచ్చాడని, ఈ మధ్యకాలంలోనే సిఐటియు మండల కన్వీనర్ గా ఎన్నికయ్యారని, సి. బెలగల్ సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శిగా మూడుసార్లు ఎన్నికయ్యారని, ప్రజా మరియు కార్మికుల సమస్యల పరిష్కార ఉద్యమాలలో ఇబ్రహీం చురుగ్గా పాల్గొనేవాడని, కార్మికుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని పరిష్కార దిశగా పోరాడేవారని, అటువంటి వ్యక్తి అకాల మరణం చెందడం సిపిఎం పార్టీకి తీరని లోటని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు జిల్లా, మండల నాయకులు, కార్యదర్శులు, హమాలి సంఘం నాయకులు, ఆశ వర్కర్లు, అంగన్వాడి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యుల డిమాండ్ల సాధనకు సంఘీభావం



**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ అక్టోబర్ 14**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేయుచున్న వైద్యాధికారుల న్యాయమైన డిమాండ్ల సాధన కొరకు చేయుచున్న సమ్మెకు మద్దతుగా మంగళవారం సి.బెళగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి, విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారుల డిమాండ్లను నెరవేర్చాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్హెచ్పి లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## జిందాల్ మైన్స్‌లో టిప్పర్ డి సూపర్వైజర్ మృతి

**బేతంచెర్ల : ఉత్తేజిత ప్రతినిధి**



: బేతంచేర్ల మండల పరిధిలోని బలపాలపల్లె గ్రామ సమీపంలోఉన్న జిందాల్ మైన్స్ లో పనిచేస్తున్న సూపర్ వైజర్ శ్రీకాంత్ రెడ్డి(28) మంగళవారం ఉదయం ట్రిప్పర్ తగలడంతో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. వివరాలకు బేతంచెర్ల పట్టణంలోని బైటిపేట కాలానికి చెందిన సింగసాని లక్ష్మిదేవి కుమారుడు సింగసాని శ్రీకాంత్ రెడ్డి గత ఆరు సంవత్సరాలుగా జిందాల్ మైన్స్ లో ఎం ఎస్ ఆర్ కంపెనీలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఉదయం టిప్పర్ మరమ్మతులకు గురి కావాడంతో బేతంచెర్లకు వస్తుండగా మార్గమధ్యంలో శబ్దం రావడంతో టిప్పర్ నిలిపి పరిశీలించడానికి వెళ్లగా ప్రమాదవశాత్తు ట్రిప్పర్ రివర్స్ కావడంతో శ్రీకాంత్ రెడ్డి ఛాతిని తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించాగ చికిత్స పొందుతూ కొలుకోలేక మృతి చెందాడు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# రైతులకు సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ ప్రారంభం...!

**రైతులు పప్పు శనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి..**

**పంపిణీకి హాజరైన ఎమ్మెల్యే గిత్త జయ సూర్య**

**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి**



అక్టోబర్ 14–: ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందించే పప్పు శనగ విత్తనాలను రైతుల సద్వినియోగం చేసుకోవాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని అల్లూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. గిరీష్ మరియు మండల వ్యవసాయ అధికారి షేక్షావలి ఆధ్వర్యంలో సబ్సిడీ పప్పు శనగ విత్తనాలు పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త మాట్లాడుతూ రైతులకు పప్పు శనగ విత్తనాల పూర్తి ధర రూ.7800 ఉండగా సబ్సిడీ రూ.1950 పోగా రైతు వాటా రూ.5850 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అర్హులైన ప్రతి రైతుకు పప్పు శనగ విత్తనాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని కట్టుబడి ఉందన్నారు. రబీ సీజన్ ప్రారంభమైన వెంటనే పప్పు శనగ విత్తనాల పంపిణీ ప్రభుత్వం చేపట్టిందని, రైతులు రైతు సేవ కేంద్రానికి వెళ్లి విత్తనాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిన్న నాగ లక్ష్మయ్య ,నందికొట్కూరు టిడిపి మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, బ్రాహ్మణ కొట్కూరు సింగిల్ విండో చైర్మన్ హరి సర్వోత్తమ రెడ్డి వ్యవసాయ అధికారులు ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆకస్మికంగా తనిఖీ చేసిన డిప్యూటీ డీఈవో

**బేతంచెర్ల: ఉత్తేజిత ప్రతినిధి :**



బేతంచెర్ల పట్టణంలో ధరణి టౌన్షిప్ లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలను డిప్యూటీ డీఈవో వెంకటరామరెడ్డి,మంగళవారం సందర్శించారు పాఠశాలలోని వివిధ రికార్డులతో పాటు మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. ఎఫ్ ఎ 2 పరీక్షలను పరిశీలించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎందుకు ప్రారంభించలేదని ఎంఈఓ అబ్రహం ను హెచ్చరించాడు మరోసారి పరిశీలనకు వచ్చేలోపు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని ఆయన అన్నారు.

## బాణసంచా విక్రయదారులు తస్మాత్ జాగ్రత్త..

విజయవాడ:బాణసంచా అమ్మకదారులు ప్రభుత్వ నిబంధనలను తప్పకపాటించాలని నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిల్వలు, అమ్మకాలు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు షాప్ సీజ్, లైసెన్స్ రద్దుకు వెనకాడబోమని జిల్లా కలెక్టర్ డా .జి.లక్ష్మీశ హెచ్చరించారు. దీపావళి పండుగ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మంగళవారం నగరంలోని భవానిపురం ఐరన్ యార్డ్‌లోగల బాణసంచా గోడౌన్‌లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన దీపావళి పండుగ సందర్భంగా ప్రజలు పెద్దయెత్తున కోనుగోలు చేస్తారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బాణసంచ విక్రయదారులు అక్రమ నిల్వలు చేయడంతో పాటు అనుమత్తులు లేకుండా విక్రయించే అవకాశం ఉంటుందన్నారు. అటువంటి వారిని గుర్తించేందుకు ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. రెవెన్యూ, పోలీస్, మునిసిపల్, అగ్నిమాపక, పౌర సరఫరాలు, విద్యుత్ తదితర శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి అక్రమ నిల్వలు అమ్మకాలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు.

## హంద్రీనీవా నుండి సీమకు త్రాగు సాగునీరు



**- హంద్రీనీవా నుండి సీమకు త్రాగు సాగునీరు**

**- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్**

**- రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి**

**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి అక్టోబర్ 14 -**

ఆసియా ఖండంలోనే అతిపెద్ద ప్రాజెక్టు అయినా హంద్రీనీవా రాయల సీమకు జీవనాడి అని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి అన్నారు. మంగళవారం నందికొట్కూరు మండల పరిధిలోని మల్యాల గ్రామంలోని మల్యాల ఎత్తిపోతల పథకం వద్ద నిర్మించిన హంద్రీనీవా పంపింగ్ స్టేషను పగిడ్యాల టిడిపి మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి , నందికొట్కూరు ఎన్నికల పరిశీలకులు దేవల్ల మురళితో కలిసి పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ , రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి సందర్శించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమలోని నాలుగు జిల్లాలకు హంద్రీనీవా ద్వారా రైతులకు సాగు త్రాగునీరు అందిస్తున్న చంద్రబాబుదే నన్నారు. గత వైసీపీకి ప్రభుత్వంలో నేను రాయలసీమ బిడ్డనని చెప్పుకున్న వైయస్ జగన్ మోహన్ రెడ్డి హెచ్ ఎన్ ఎస్ ఎస్ కాలువకు ఐదు సంవత్సరాలలో కేవలం రెండువేల కోట్లు ఖర్చు పెట్టి ప్రాజెక్టును ఆదుకున్న దాఖలాలు లేవన్నారు .కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చిన వెంటనే హెచ్.ఎన్.ఎస్.ఎస్ కాల్వకు 3800 కోట్లతో ఆధునికరణ పనులు పేజ్ 1 ,పేజీ2 పనులు పూర్తి చేసి దాదాపు కుప్పంలోని చివరి ఆయకట్టు వరకు కృష్ణా జలాలను తీసుకెళ్లిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పగడం సోమశేఖర్, దత్తు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఐదేళ్ల పాటు సేవలు అందించనున్న మాజీ ఎంపీ

మహబూబ్‌నగర్: మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మకమైన కాన్‌స్టిట్యూషన్ క్లబ్ కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ పదవిలో ఆయన ఐదేళ్లపాటు కొనసాగనున్నారు. 1947లో ఏర్పాటైన ఈ క్లబ్, ఎంపీలు, మాజీ ఎంపీల సమావేశాలకు వేదిక. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అధ్యక్షుడిగా ఉన్న ఈ సంస్థకు జితేందర్‌రెడ్డి ఎన్నిక కావడం ఆయన రాజకీయ ప్రస్థానంలో ముఖ్య మైలురాయి. ఇది ఆయనకు దక్కిన గొప్ప గౌరవం.

న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మకమైన కాన్‌స్టిట్యూషన్ క్లబ్ కోశాధికారిగా మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి శుక్రవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ కీలక పదవిలో జితేందర్‌రెడ్డి ఐదేళ్లపాటు కొనసాగనున్నారు. 1947లో భారత రాజ్యాంగ సభ సభ్యులచే ఏర్పాటు చేయబడిన ఈ క్లబ్, ప్రస్తుతం పార్లమెంటు ఉభయ సభలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు, మాజీ ఎంపీలు సమావేశాలు, చర్చలు నిర్వహించు కోవడానికి ఒక ముఖ్యమైన వేదికగా ఉపయోగపడుతుంది. ఈ సంస్థకు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అధ్యక్షుడిగా, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ ప్రధాన కార్యదర్శిగా, కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ఇటువంటి ప్రతిష్టాత్మక సంస్థలో కోశాధికారిగా జితేందర్‌రెడ్డి ఎన్నిక కావడం ఆయన రాజకీయ ప్రస్థానంలో ఒక మైలురాయిగా చెప్పవచ్చు.



ఏపీ జితేందర్‌రెడ్డి సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నారు. వివిధ హోదాల్లో ప్రజలకు సేవలందించారు. ఆయన తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1999లో మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున ఎంపీగా గెలిచి పార్లమెంటులో అడుగుపెట్టారు. ఆ సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన చురుకైన పాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం ఉధృతమయ్యాక, జితేందర్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుత బీఆర్ఎస్)లో చేరారు. తెలంగాణ వాదానికి మద్దతుగా నిలిచారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి మరోసారి ఎంపీగా విజయం సాధించారు. పార్లమెంటులో తెలంగాణ ప్రయోజనాల కోసం గట్టిగా తన వాదనను వినిపించారు. 2019 ఎన్నికల తర్వాత ప్రత్యక్ష రాజకీయాల నుంచి కాస్త పక్కకు జరిగినా.. ఆయనకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు అప్పగించారు. ఈ పదవిలో ఉంటూ రాష్ట్ర ప్రభుత్వానికి విలువైన సలహాలు, సూచనలు అందించారు. అనంతరం బీజేపీలో చేరారు. ఆ పార్టీలో చురుగ్గా వ్యవహరించారు.

# చనిపోయాడనుకున్న వ్యక్తి బతికే ఉన్నాడు

వరంగల్: ఎంజీఎం ఆసుపత్రిలో పోలీసుల నిర్లక్ష్యం వల్ల తీవ్ర గందరగోళం నెలకొంది. మైలారం గ్రామానికి చెందిన గోక కుమారస్వామి మరణించాడని భావించి, ఆయన కుటుంబానికి మరొకరి మృతదేహాన్ని అప్పగించారు. కుటుంబ సభ్యులు దహన సంస్కారాలకు సిద్ధమవుతుండగా.. మృతదేహం తమవారిది కాదని, చేతిపై ఉన్న పచ్చబొట్టు లేదని గుర్తించారు. అసలు ట్విస్ట్ ఏంటంటే కుమారస్వామి బతికే ఉన్నారు. ప్రస్తుతం ఆయన ఎంజీఎం ఆసుపత్రిలోని ఐడీ వార్డులో చికిత్స పొందుతున్నారు. చనిపోయిన వ్యక్తి ఎవరు? ఈ పొరపాటు ఎలా జరిగిందనే దానిపై విచారణ జరుగుతోంది. ఈ ఘటన ఆసుపత్రి, పోలీసుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి అవుట్‌పోస్టు పోలీసుల నిర్లక్ష్యం కారణంగా జరిగిన ఒక సంఘటన తీవ్ర గందరగోళానికి, ఆశ్చర్యానికి దారితీసింది. ఒకరి మృతదేహాన్ని మరొకరికి అప్పగించిన ఘటనలో చనిపోయాడనుకున్న వ్యక్తి బతికే ఉన్నాడని తెలిసి అంతా అవాక్కయ్యారు.

మైలారం గ్రామానికి చెందిన గోక కుమారస్వామి (50) చాలా కాలం క్రితం ముంబై వెళ్లి, అక్కడే రమ అనే యువతిని వివాహం చేసుకున్నారు. వారికి ఒక కుమార్తె కూడా ఉంది. సుమారు 20 ఏళ్ల క్రితం విభేదాల కారణంగా దంపతులు విడిపోయారు. రమ మైలారంలో నివసిస్తుండగా.. కుమారస్వామి మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నారు. మూడు రోజుల క్రితం తొర్రూరులోని బజాజ్ షోరూం సమీపంలో ఒక వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా.. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు 108 అంబులెన్స్ సహాయంతో ఆ వ్యక్తిని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఆ వ్యక్తి మృతి చెందాడు.

ఈ సమాచారాన్ని తొర్రూరు పోలీసులు కుమారస్వామి బంధువులకు తెలిపారు. మృతుడు కుమారస్వామి అని భావించి ఆయన భార్య రమ, ఇతర కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆసుపత్రికి వచ్చారు. తొర్రూరు పోలీసులు శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని వారికి అప్పగించారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లి దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేస్తుండగా ఊహించని ట్విస్ట్ చోటు చేసుకుంది.

కుటుంబ సభ్యులు మృతదేహాన్ని పరిశీలించగా.. అది తమవారిది కాదని గుర్తించారు. ముఖ్యంగా, కుమారస్వామి చేతిపై 'శ్రీ' అనే పచ్చబొట్టు ఉండేది, అది ఈ మృతదేహంపై లేకపోవడాన్ని గమనించారు. దీంతో వారు షాకయ్యారు. వెంటనే అదే వాహనంలో మృతదేహాన్ని తిరిగి ఎంజీఎం మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యులు అక్కడి సిబ్బందిని ప్రశ్నించగా శనివారం రమ్మని చెప్పడంతో వెనుదిరిగారు. అయితే, అసలు ట్విస్ట్ ఇక్కడే ఉంది. చనిపోయాడనుకున్న గోక కుమారస్వామి బతికే ఉన్నారని.. ప్రస్తుతం ఎంజీఎం ఆసుపత్రిలోని ఐడీ వార్డులో చికిత్స పొందుతున్నారని తెలిసింది. ఈ

విషయం తెలియగానే కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు అందరూ అవాక్కయ్యారు. పోలీసుల తప్పిదం కారణంగా మృతదేహం తారుమారైందని తెలిసింది. అయితే అసలు చనిపోయిన వ్యక్తి ఎవరో, అపస్మారక స్థితిలో ఆసుపత్రికి తరలించబడిన అసలైన కుమారస్వామి ఎలా ఉన్నాడో అనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటన ఎంజీఎం ఆసుపత్రిలో శవాల నిర్వహణలో, పోలీసుల నిర్లక్ష్యంలో ఉన్న లోపాలను స్పష్టం చేసింది. ఇలాంటి పొరపాట్లు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రేవంత్ టీంలో టాప్ 3 పెర్ఫార్మెన్స్ మంత్రులు వీరే..!



తెలంగాణ: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన 19వ కేబినెట్ సమావేశంలో మంత్రుల పనితీరుపై సమీక్ష జరిగినట్లు తెలిసింది. ఈ రివ్యూలో భట్టి విక్రమార్క (ఆర్థిక, ఇంధన శాఖ), డి. శ్రీధర్ బాబు (ఐటీ, పరిశ్రమలు), పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి (రెవెన్యూ, గృహ నిర్మాణం) టాప్ పర్ఫార్మర్లుగా నిలిచినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. పలువురు మంత్రులు అంచనాలు అందుకోలేకపోయినట్లు తెలిసింది. ఆ వివరాలేంటో ఇప్పుడు చూద్దాం.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఇటీవల జరిగిన 19వ కేబినెట్ సమావేశంలో మంత్రుల పనితీరుపై శాఖలవారీగా సమీక్ష జరిగినట్లు తెలిసింది. గత 18 కేబినెట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలులో కొందరు మంత్రులు తమ సహచరులు, ముఖ్యమంత్రిని సైతం అధిగమించి అద్భుతమైన పనితీరును కనబరిచినట్లు సమాచారం. రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా కేబినెట్ రిపోర్ట్ కార్డ్ తయారు చేయించారని.. అందులో మంత్రుల పనితీరుకు సంబంధించిన రిపోర్టును అధికారులు నివేదిక రూపంలో ఇచ్చినట్లు తెలిసింది. తెలంగాణ మంత్రుల మార్కుల పట్టిక తయారు చేయగా.. ఎవరు పాస్, ఎవరు ఫెయిల్? అనే విషయాలు తెలుసుకుందాం. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు తెలంగాణ డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, సమాచార, పౌర సంబంధాలు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తమ సహచరుల కంటే ముందు వరుసలో ఉన్నారు.

ఉపముఖ్యమంత్రిగా, ఇందన శాఖను పర్యవేక్షిస్తున్న భట్టి విక్రమార్క గ్రీన్ ఎనర్జీతో సహా ముఖ్యమైన ఇంధన విధానాలను రూపొందించడంలో, సౌర, జల విద్యుత్ ఉత్పత్తిలో ఇతర రాష్ట్రాలతో ఒప్పందాలను ఖరారు చేయడంలో, పెరుగుతున్న ఆర్థిక అవసరాలను తీర్చడానికి వనరులను సమీకరించడంలో విజయం సాధించారు. వేసవిలో గరిష్ట విద్యుత్ డిమాండ్‌ను తీర్చడం, దేశీయ, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ అందించడం వంటివి కేబినెట్ సమావేశాల్లో ఆమోదించిన విధానాల ప్రకారం జరగడం ప్రశంసలు అందుకుంది.

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పరిశ్రమల స్థాపనకు ప్రపంచ పెట్టుబడులను ఆహ్వానించడం ద్వారా కేబినెట్ నిర్ణయాలను అమలు చేయడంలో చురుకైన పాత్ర పోషించారు. పెట్టుబడులకు గమ్యస్థానంగా రాష్ట్రాన్ని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించారు. భూ భారతి పోర్టల్‌ను అభివృద్ధి చేయడం, ఇందిరమ్మ ఇళ్లను వేగవంతంగా నిర్మించడం ద్వారా మంత్రి పొంగులేటి తన బాధ్యతలను పూర్తి చేశారు. ఈ ముగ్గురు టాప్3లో కొనసాగుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖలను నిర్వహిస్తున్నప్పటికీ.. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు అమలులో వెనుకబడ్డారు. నిధుల కొరత, మూసీ నది వెంబడి ఉన్న కాలనీల తరలింపులో అనేక అడ్డంకులు ఎదుర్కొన్నారు. అయితే, విద్య, హోం శాఖలను కూడా తన వద్ద ఉంచుకున్న ముఖ్యమంత్రి.. ఉపముఖ్యమంత్రి సహాయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను స్థాపించడంలో మంచి ఫలితాలను సాధించారు. శాంతిభద్రతలను పటిష్టం చేయడానికి, సైబర్ నేరాలను అరికట్టడానికి హోం శాఖ తీసుకున్న విధాన నిర్ణయాలు మంచి ఫలితాలనిచ్చాయి.

**ఇతర మంత్రుల పనితీరు**

పౌరసరఫరాల శాఖను పటిష్టం చేయడంలో సన్న బియ్యం పంపిణీని అమలు చేయడంలో సీనియర్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజయం సాధించినప్పటికీ.. ఇరిగేషన్ మంత్రిగా నీటిపారుదల రంగంలో లక్ష్యాలను చేరుకోలేకపోయారని సంబంధిత వర్గాలు తెలిపాయి. రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రిపోర్టు కార్డులో వెనకబడ్డారు. ముఖ్యంగా (హైబ్రిడ్ అన్యూటీ మోడల్) కింద రహదారి నెట్‌వర్క్ అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాలను అమలు చేయడంలో చురుకుగా లేరని తెలిసింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పలు నిర్ణయాలను అమలు చేయడంలో చురుగ్గా ఉన్నప్పటికీ.. వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కొంత నెమ్మదిగా ఉన్నట్లు తెలిసింది. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సంబంధిత శాఖలు, ముఖ్యంగా ప్లానింగ్ బోర్డు సహకారంతో కుల సర్వేను పూర్తి చేయడంలో చురుగ్గా పని చేశారు.

కొండా సురేఖ (దేవాదాయ శాఖ), సీతక్క (పంచాయతీ రాజ్), జూపల్లి కృష్ణారావు (ఎక్సైజ్, పర్యాటకం), తుమ్మల నాగేశ్వరరావు (వ్యవసాయం) తమ తమ బాధ్యతలను సమర్థవంతంగా పూర్తి చేశారు. కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులు గడ్డం వివేక్ (కార్మిక, ఉపాధి శాఖ), వాకటి శ్రీహరి (పశుసంవర్ధక శాఖ) అడ్లూరి లక్ష్మణ్ (సంక్షేమ శాఖ) తమ తమ శాఖలలో చివరి కేబినెట్ నిర్ణయాలను అమలు చేయడంపై అప్‌డేట్‌లను అందించినట్లు తెలిసింది.

# స్పెషల్ ట్రైన్ సేవలు పొడిగింపు



తిరుమల: శ్రీవారి దర్శనానికి తెలంగాణ నుంచి వెళ్లేవారికి గుడ్‌న్యూస్. చర్లపల్లి- తిరుపతి (07017/ 07018) ప్రత్యేక ట్రైన్ సేవలను ఆగస్టు నెలాఖరు వరకు సౌత్ సెంట్రల్ రైల్వే పొడిగించింది. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ రైలు చర్లపల్లి నుండి బయలుదేరి మల్కాజిగిరి, కాచి గూడ, మహబూబ్‌నగర్, కర్నూల్ సిటీ, కడప వంటి ముఖ్య స్టేషన్లలో ఆగుతూ తిరుపతి చేరుకుంటుంది. భక్తులు, సాధారణ ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

తెలంగాణ నుంచి తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులకు తీపి కబురు. చర్లపల్లి- తిరుపతి- చర్లపల్లి (07017 / 07018) ప్రత్యేక ట్రైన్ సేవలను సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు పొడిగించారు. ఈ ట్రైన్ ఆగస్టు నెలాఖరు వరకు నడుస్తుందని చెప్పారు. వాస్తవానికి ఈ రైలు సేవలను జులై నెలాఖరు వరకు మాత్రమే నడపాలని ముందుగా నిర్ణయించారు. అయితే, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రత్యేక రైలు భక్తులకు, సాధారణ ప్రయాణికులకు తిరుపతి యాత్రను మరింత సులభతరం చేస్తోంది. దీని ద్వారా చర్లపల్లితో పాలు పలు ప్రాంతాల నుంచి ప్రజలు నేరుగా తిరుపతికి చేరుకోవచ్చు. ఈ రైలు మార్గమధ్యంలో పలు ముఖ్యమైన స్టేషన్లలో ఆగుతుంది. తెలంగాణలోని మల్కాజిగిరి, కాచిగూడ, ఉమ్దానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల్, ఏపీలోని కర్నూల్ సిటీ, డోన్, గూటీ, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది.

ఇక చర్లపల్లి హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న ఒక ముఖ్యమైన రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చెందుతోంది. ప్రధాన రైల్వే స్టేషన్లలో రద్దీని తగ్గించడానికి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాన్ని అందించడానికి ఇక్కడ నుండి పలు ప్రత్యేక రైళ్లను అధికారులు నడుపుతున్నారు. తిరుపతికి నడుస్తున్న ప్రత్యేక రైలుతో పాటు, పండుగలు, ప్రత్యేక సందర్భాలలో లేదా రద్దీ ఎక్కువగా ఉండే మార్గాలలో చర్లపల్లె నుండి వివిధ ప్రాంతాలకు అదనపు రైళ్లు నడపబడుతున్నాయి. ప్రస్తుతం చర్లపల్లె నుండి నడుస్తున్న కొన్ని ముఖ్యమైన ప్రత్యేక రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. చర్లపల్లె- కాకినాడ పోర్ట్/ నర్సాపూర్ ట్రైన్ నడుపుతున్నారు. గోదావరి జిల్లాల వైపు ప్రయాణించే వారికి సౌకర్యంగా ఉంటుంది. చర్లపల్లె- సికింద్రాబాద్/ నాందేడ్ ట్రైన్ ఉత్తర తెలంగాణ, మహారాష్ట్ర వైపు వెళ్లే వారికి ప్రత్యామ్నాయంగా ఉంటుంది. వేసవి సెలవులు, పండుగల సమయంలో ప్రముఖ పర్యాటక కేంద్రాలకు కూడా చర్లపల్లి నుంచి ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు.

# చిరుత పులుల కలకలం..

హైదరాబాద్: ఆధ్వర్యంలోని బాలాపూర్ ఆర్‌సీఐ ప్రాంగణంలో చిరుత పులులు సంచరించినట్లు తెలిసింది. దీంతో అధికారులు వెంటనే అటవీశాఖకు సమాచారం అందించారు. ఉద్యోగులు, డిఫెన్స్ ల్యాబ్ స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులకు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

హైదరాబాద్‌లోని రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థకు చెందిన రీసెర్చ్ సెంటర్ ఇమారత్ ప్రాంగణంలో చిరుత పులుల సంచారం తీవ్ర కలకలం రేపింది. బాలాపూర్‌లోని రెండు రోజుల క్రితం ఒక వాచ్‌మెన్ పెద్ద జంతువులను చూసినట్లు, అవి చిరుత పులుల్లా ఉన్నాయని అధికారులకు తెలిపారు. మరుసటి రోజు ఒక శునకం అనుమానాస్పదంగా మృతి చెంది ఉండటంతో చిరుత పులులు ఉన్నాయనే అనుమానాలు మరింత బలపడ్డాయి. దీంతో ఆర్‌సీఐ అధికారులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న ప్రాంగణం, దట్టమైన వృక్ష సంపద, జలాశయాలతో కూడి ఉండటంతో అటవీ జంతువులకు ఆవాసంగా మారే అవకాశం ఉంది. అటవీ శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగి ఆర్‌సీఐ లోపల విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అయితే, ఎక్కడా చిరుత పులుల జాడ కనిపించలేదు. అయినప్పటికీ ముందు జాగ్రత్త చర్యగా ఉద్యోగులను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆర్‌సీఐ ప్రాంగణంలో రెండు చిరుత పులులు తిరుగుతున్నాయన్న సమాచారంతో డిఫెన్స్ ల్యాబ్ స్కూల్ ప్రిన్సిపల్ శుక్రవారం తల్లిదండ్రులకు హెచ్చరికలు జారీ చేశారు. పిల్లలను ఒంటరిగా బయటికి పంపవద్దని, మేనేజ్‌మెంట్ సూచనల మేరకు ఈ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. బాలపూర్ పోలీసులు సైతం అప్రమత్తమై, సంచరిస్తున్న జంతువులు ఏంటో స్పష్టంగా తెలిసే వరకు సిబ్బంది, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత కొన్నేళ్లుగా హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో, ముఖ్యంగా అటవీ ప్రాంతాలకు ఆనుకొని ఉన్న నివాస, పారిశ్రామిక ప్రాంతాల్లో వన్యప్రాణుల సంచారం పెరుగుతోంది. చిరుత పులులు, నక్కలు, అడవి పందులు వంటి జంతువులు ఆహారం, నీటి అన్వేషణలో మానవ నివాస ప్రాంతాల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఇది మానవ-వన్యప్రాణుల సంఘర్షణకు దారితీస్తోంది. గతంలో కూడా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, నార్సింగి వంటి ప్రాంతాల్లో చిరుత పులులు సంచరించిన ఘటనలు నమోదయ్యాయి. అటవీ ప్రాంతాలు తగ్గిపోవడం, అక్రమ ఆక్రమణలు, వన్యప్రా ణుల ఆవాసాలు ధ్వంసం కావడం వంటి కారణాలు ఈ సంఘర్షణకు దారితీస్తున్నాయి.

ఈ నేపథ్యంలోనే ఆర్‌సీఐ వంటి కీలకమైన రక్షణ సంస్థ ప్రాంగణంలో చిరుత పులుల సంచారం ఆందోళన కలిగిస్తోంది. అటవీ శాఖ అధికారులు, స్థానిక పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని, ప్రజల భద్రతను నిర్ధారించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# మహిళలకు చెక్కుల పంపిణీ

రుణాలు తీసుకున్న మహిళా సంఘాల సభ్యులు మరణిస్తే.. వారి పేరిట ఉన్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తుంది. గత ఏడాదిన్నర కాలంలో మరణించిన 385 మంది సభ్యుల కుటుంబాలకు ప్రమాద బీమా చెక్కులను, 2,502 మంది కుటుంబాలకు రుణ బీమా చెక్కులను నేటి నుంచి పంపిణీ చేయనున్నారు.



తెలంగాణ: ప్రభుత్వం మహిళలకు శుభవార్త చెప్పింది. ఇందిరా మహిళాశక్తి సంబరాలలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు నేటి నుంచి రూ.344 కోట్ల వడ్డీలేని రుణాల చెక్కులు పంపిణీ చేయనుంది. గ్రామీణ సంఘాలకు రూ. 300 కోట్లు, పట్టణ సంఘాలకు రూ. 44 కోట్లు అందజేయనున్నారు. ప్రమాద బీమా కింద మరణించిన సభ్యుల కుటుంబాలకు రూ. 10 లక్షలు, రుణ బీమా కింద రుణాల మాఫీ అందిస్తారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలకు గుడ్‌న్యూస్ చెప్పింది. ఇందిరా మహిళాశక్తి సంబరాలను పురస్కరించుకుని మహిళా స్వయం సహాయక సంఘాలకు భారీ ఆర్థిక చేయూతను అందించనుంది. వడ్డీలేని రుణాల పథకం కింద రూ. 344 కోట్ల విలువైన చెక్కులను మహిళా సంఘాల సభ్యులకు నేటి నుంచి పంపిణీ చేయనుంది. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి సీతక్కతో పాటు నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతిని ధులు మహిళా సంఘాలకు చెక్కులను పంపిణీ చేయనున్నారు. ఈ పథకం ద్వారా మహిళా సంఘాలు తీసుకున్న రుణాలపై వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తుంది. తద్వారా వారిపై ఆర్థిక భారం తగ్గుతుంది. ప్రభుత్వం ఇటీవల గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థకు రూ. 344 కోట్లు విడుదల చేసింది. ఇందులో రూ. 300 కోట్లు గ్రామీణ మహిళా సంఘాలకు, రూ. 44 కోట్లు పట్టణ మహిళా సంఘాలకు అందజేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో శనివారం నుంచి ఈ నెల 18 వరకు ఈ చెక్కుల పంపిణీ జరుగుతుంది. ఈ నిధులు పంపిణీ చేసిన వెంటనే ఆయా సంఘాల ఖాతాల్లో జమవుతాయి. వడ్డీ చెక్కులతో పాటు, మహిళా సంఘాల సభ్యులకు అమలు చేస్తున్న ప్రమాద బీమా, రుణ బీమా పథకాల చెక్కులను కూడా పంపిణీ చేయనున్నారు.

మహిళా సంఘాల సభ్యులు ప్రమాదవశాత్తూ మరణిస్తే.. వారి కుటుంబానికి బీమా పథకం కింద రూ. 10 లక్షలు అందజేయనున్నారు. రుణాలు తీసుకున్న మహిళా సంఘాల సభ్యులు మరణిస్తే.. వారి పేరిట ఉన్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తుంది. గత ఏడాదిన్నర కాలంలో మరణించిన 385 మంది సభ్యుల కుటుంబాలకు ప్రమాద బీమా చెక్కులను, 2,502 మంది కుటుంబాలకు రుణ బీమా చెక్కులను నేటి నుంచి పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమం తెలంగాణలోని మహిళా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, వారి ఆర్థిక స్వావలంబనకు గణనీయంగా దోహదపడుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ చర్యలు మహిళల సాధికారతకు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జీవనోపాధి అవకాశాలను మెరుగుపరచడానికి ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు చెబుతున్నారు.

# 500 కోసం తెలంగాణ యువకుడి హత్య



తెలంగాణ: తమిళనాడులోని అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేస్తున్న తెలంగాణ భక్తుడు విద్యా సాగర్ (32) దారుణ హత్యకు గురయ్యాడు. కేవలం రూ.500 కోసం ఆ రాష్ట్రానికే చెందిన ఇద్దరు యువకులు కిరాతకానికి పాల్పడ్డారు. కత్తితో దాడి చేసి పారిపోగా.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ విద్యా సాగర్ మరణించాడు. నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనతో తెలుగు భక్తుల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

తమిళనాడులోని అరుణాచలేశ్వరస్వామి గిరి ప్రదక్షిణకు వెళ్లిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఒక భక్తుడు దారుణ హత్యకు గురయ్యాడు. యాదాద్రి జిల్లా మోత్కురు మండలం సౌందరాపురం గ్రామానికి చెందిన విద్యా సాగర్ (32) శుక్రవారం అరుణాచలంలో హత్యకు గురైనట్లు పోలీసులు తెలిపారు. కేవలం రూ.500 కోసం జరిగిన ఈ దారుణం స్థానికంగా చర్చకు దారి తీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సౌందరాపురం గ్రామానికి చెందిన విద్యా సాగర్ గిరి ప్రదక్షిణ చేస్తున్న సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు అతనిని ఢీకొట్టారు.

దీనిపై విద్యా సాగర్ ప్రశ్నించగా.. ఆ యువకులు అతనిపై తిరగబడ్డారు. డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కత్తితో దాడి చేసి అక్కడి నుండి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన విద్యా సాగర్‌ను తోటి భక్తులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆ ప్రాంతంలోని నిఘా కెమెరాల రికార్డింగ్‌లను పరిశీలించగా.. తిరువణ్ణామలైకి చెందిన గుగనేశ్వరన్ (22), తమిళరసన్ (25) అనే ఇద్దరు వ్యక్తులు విద్యా సాగర్ నుండి డబ్బు రూ.500 లాక్కొని పారిపోయినట్లు తేలింది. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, పోస్టుమార్టం తర్వాత విద్యాసాగర్ మృతదేహం స్వగ్రామానికి తరలించారు. కుమారుడి మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ దృష్టం అక్కడున్న వారిచే కంటతడి పెట్టించింది. ఈ దారుణ ఘటనతో అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేసే తెలుగు భక్తుల భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది భక్తులు అరుణాచలం గిరి ప్రదక్షిణలో తెలుగు వారిపై వివక్ష చూపుతున్నారని ఆరోపణలు చేస్తున్నారు. ఆలయ పరిసరాల్లో భద్రతను పటిష్టం చేయాలని, భక్తులకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ఘటన అరుణాచలం వంటి పుణ్యక్షేత్రంలో భక్తుల భద్రతపై తీవ్ర ప్రశ్నలను లేవనెత్తింది.

# డ్రై ఫ్రూట్స్ తింటే..



ఈ రోజుల్లో అధిక బరువు కారణంగా ఇబ్బంది పడేవారి సంఖ్య పెరుగుతోంది. చాలా మంది బరువు తగ్గడానికి.. కఠిన ఆహార నియమాలు పాటిస్తూ ఉంటారు. కొందరు తినడం మానేసి కడుపు కాల్చుకుంటుంటే.. మరికొందరు రుచి లేని ఆహారం తింటూ ఇబ్బంది పడుతుంటారు. కడుపు కాల్చుకోకుండా, టేస్టీ ఫుడ్ తింటూ కూడా బరువును తగ్గించుకోవచ్చని నిపుణులు అంటున్నారు. ఆ కోవకు చెందినవే డ్రై ఫ్రూట్స్. బరువును తగ్గించడానికి, కంట్రోల్‌లో ఉంచడానికి డ్రై ఫ్రూట్స్ తోడ్పడతాయని నిపుణులు చెబుతున్నారు. డ్రై ఫ్రూట్స్‌లోని మినరల్స్, విటమిన్స్, మంచి కొవ్వులు.. బరువును తగ్గించడానికి సహాయపడతాయి.

బరువు ఎలా తగ్గిస్తాయి.. మన డైట్‌లో డ్రై ఫ్రూట్స్ చేర్చుకుంటే.. మెటబాలిక్ రేట్ మెరుగుపడుతుంది. వీటినిలోని మినరల్స్, ఎంజైమ్స్, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి.. ఇవన్నీ జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థ అధిక జీవక్రియ రేటుకు దారితీస్తుంది, ఫలితంగా శరీరంలో వేడి ఉత్పత్తి పెరిగి.. శక్తి వ్యయం పెరుగుతుంది. డ్రైఫ్రూట్స్ మన ఆహారంలో చేర్చుకుంటే.. ఎక్కువ సేపు కడుపును నిండుగా ఉంచుతాయి. వీటిలో ఫైబర్ అధికంగా ఉంటుంది, ఇది మీ కడుపును ఎక్కువ సేపు నిండుగా ఉంచుతుంది, అతిగా తినకుండా నిరోధిస్తుంది. డ్రై ఫ్రూట్స్ శరీరంలోని కొవ్వుగా నిల్వ ఉన్న కేలరీల సంఖ్యను తగ్గించడానికి తోడ్పడతాయి. మీరు బరువు తగ్గాలనుకుంటే.. ఏ డ్రైఫ్రూట్స్ తీసుకోవాలో ఈ స్టోరీలో చూద్దాం.









ఎండుద్రాక్ష.. ఎండుద్రాక్ష తరచు మీ ఆహారంలో చేర్చుకుంటే.. బరువును కంట్రోల్‌లో ఉంచుతుంది. నానబెట్టిన ఎండుద్రాక్షలు తీసుకుంటే.. ఇంకా ప్రభావవంతంగా పని చేస్తాయని అంటున్నారు. ఇవి స్వీట్ క్రేవింగ్స్‌ను తగ్గిస్తాయి, రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచుతాయి. ఎండుద్రాక్షలో సోడియం తక్కువగా ఉంటుంది. అయోడిన్, ఫైబర్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి బరువును కంట్రోల్‌లో ఉంచడానికి ఎఫెక్టివ్‌గా పనిచేస్తాయి. డ్రై అంజీర్‌లో ఫైబ్ కంటెంట్ అధికంగా ఉంటుంది. ఇది కడుపును ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది, జీర్ణక్రియకు సహాయపడుతుంది.తద్వారా చిరుతిండ్లు ఎక్కువగా తినకుండా నిరోధిస్తుంది. అంజీర్‌లోని పోషకాలు..జీవక్రియ రేటును ప్రోత్సహిస్తాయి. వీటిలో సమృద్ధిగా ఉండే.. ఒమేగా - 3 ఫ్యాటీ యాసిడ్స్ వ్యాయామం చేసే సమయంలో ఎక్కువ కేలరీలను బర్న్ చేయడానికి తోడ్పడతాయి. వీటిలోని ఫైబర్, పొటాషియం.. హైపర్‌టెన్షన్‌ను కంట్రోల్‌లో ఉంచుతాయి, శరీరంలో నీటి నిలుపుదలను తగ్గిస్తాయి. తాజా పండ్ల కంటే క్యాలరీలు తక్కువగా ఉంటాయి.

బాదం.. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. ఆరోగ్యాన్నిచ్చే మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. కొలెస్ట్రాల్ ఉండదు. విటమిన్-ఇ శాతం ఎక్కువే. ఇవన్నీ గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. బాదంలోని మెగ్నీషియం రక్తంలోని చక్కెరల్ని అదుపు చేస్తుంది. తద్వారా ఆహారం ఎక్కువగా తినాలన్న కోరిక తగ్గుతుంది. ఖర్జూరంలో ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఫైబర్ మిమ్మల్ని ఎక్కువ కాలం నిండుగా ఉంచుతుంది. మీరు అతిగా తినకుండా నిరోధిస్తుంది. ఖర్జూరంలోని విటమిన్ శక్తిని పెంచుతుంది. ప్రొటీన్లు, క్యాల్షియం, ఇనుము, పొటాషియం, మెగ్నీషియం, కాపర్.. ఎ, బి1, బి2.. వంటి విటమిన్లు, ఫ్రక్టోజ్, సెల్యులోజ్, ఫైబర్, ఎలక్ట్రోలైట్స్, ఫాస్ఫరస్, ఐరన్ వంటి పోషకాలు ఉంటాయి.





# మైదా, వరి పిండి బదులు..!

మనం ఇంట్లో ఎక్కువగా వరి పిండి, గోధుమ పిండి, మైదా ఎక్కువగా వాడుతుంటాం. చపాతీ, దోశలు, పిండి వంటలు చేయడానికి ఎక్కువగా పిండ్లే ఎక్కువగా వాడుతుంటారు. ఇక మైదాతో బిస్కెట్లు, బ్రెడ్డు, పఫ్‌లు, రోల్స్, నూడుల్స్, మంచూరియా ఇలా ఏది చూసినా అదే. మైదాలాంటి రిఫైండ్ పిండితో చేసిన పదార్థాలు దీర్ఘకాలిక వ్యాధులకు కారణవుతాయి. దీని వల్ల జీర్ణవ్యవస్థ దెబ్బతినడమే కాక గుండె సంబంధిత జబ్బులు, క్యాన్సర్ తదితర ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. అంతేకాదు.. వరి, గోధుమ పిండిని మితంగానే తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. పోషకాల కంటెంట్, ఫైబర్ అధికంగా ఉండే.. పిండిని మన ఆహారంలో చేర్చుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఎక్కువ పోషకాలు, గ్లూటెన్ ఫ్రీ , ఫైబర్ ఉండే తృణధాన్యాల పిండ్లు మన ఆహారంలో చేర్చుకోవాలని అంటున్నారు. శనగపిండి... శనగలు ప్రొటీన్ స్టోర్ హౌస్. అంతేకాదు వీటిలో ఎ,సి,బి6,ఫోలేట్,నియాసిన్, థైమీన్,మాంగనీస్, ఫాస్ఫరస్, ఐరన్, కాపర్ లాంటి విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ఇది గ్లూటెన్ ఫ్రీ, బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంచుతుంది. ఇందులో ఉండే ఫైబర్‌తో మలబద్ధకం సమస్య రాదు. పొట్టలోని బ్యాక్టీరియాను ఆరోగ్యంగా ఉంచుతుంది. కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. గుండె జబ్బులు రాకుండా చూడటమే కాదు.. బీపీని అదుపులో ఉంచుతుంది. మీరు వరి, మైదాకు బదులుగా శనగపిండిని వాడొచ్చు. క్వినోవా పిండిలో మన శరీరానికి కావాల్సిన తొమ్మిది రకాల అమైనో యాసిడ్స్ ఉంటాయి. వీటితో పాటు ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. వీటితో పాటు మెగ్నీషియం, కాపర్ వంటి మినరల్స్ ఉంటాయి. ఇవి ఎముక ఆరోగ్యానికి, జీవక్రియల పనితీరును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. పైగా ఇందులో గ్లూటెన్ ఉండదు. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్‌లో ఉంచుతాయి. బరువును కంట్రోల్‌లో ఉంచుతుంది. ఓట్స్‌లో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, కార్బోహైడ్రేట్స్ ఎక్కువ. ఇవి త్వరగా అరగవు. దీంతో ఎక్కువ సమయం ఆకలనిపించదు. దీంతో త్వరగా బరువు తగ్గుతారు. మైదా, వరి పిండికి బదులుగా ఇది మీ ఆహారంలో చేర్చుకుంటే.. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. బ్రౌన్ రైస్ పిండి గ్లూటెన్ ఫ్రీ. దీనిలో మెగ్నీషియం, ఫాస్ఫరస్ విటమిన్ బి వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. ఇది జీర్ణక్రియలో సహాయపడుతుంది. బరువును కంట్రోల్‌లో ఉంచుతుంది. బాదం పిండిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, విటమిన్ ఇ పుష్కలంగా ఉంటాయి. ఇందులో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. ఇది గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది, బరువును కంట్రోల్‌లో ఉంచుతుంది. కొబ్బరి పిండిలో ఫైబర్ అధికంగా ఉంటుంది, ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది, రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడానికి సహాయపడుతుంది.







# ఈ టీ తాగితే షుగర్ కంట్రోల్ అవుతుందట..













చాలా మందికి ఉదయాన్నే టీ, కాఫీ తాగే అలవాటు ఉంటుంది. అయితే, ఈ టీల కంటే కొన్ని టీలు తాగడం వల్ల హెల్త్ చాలా బావుంటుంది. అదే బ్లాక్ టీ. మరి బ్లాక్ టీ తాగడం వల్ల కలిగే లాభాలు ఏంటో తెలుసుకోండి. రెగ్యులర్ టీ, కాఫీల బదులు ఈ టీ తాగితే షుగర్ కంట్రోల్ అవుతుందట.. టీ లేనిదే చాలా మందికి గడవదు. కానీ, ఉదయాన్నే తాగితే జీర్ణ సమస్యలు వంటివి వస్తాయి. మరి అలా కాకుండా టీ తాగినా ఎలాంటి సమస్యలు రావొద్దంటే హెల్దీ టీలకి షిఫ్ట్ అవ్వాల్సిందే. అందులో డార్క్ టీ కూడా ఒకటి. ఈ టీ తాగితే బ్లడ్ షుగర్, డయాబెటిస్ కంట్రోల్ అవుతుంది. పూర్తి వివరాలు తెలుసుకోండి. బ్లాక్ టీ.. బ్లాక్ టీ అనేది ఆక్సీకరణ చెందిన ఆకులతో తయారైన టీ. ఇది చైనాకి చెందిన ట్రీ. బ్లాక్ టీ ఆక్సీకరణ చేసిన టీ. గ్రీన్ అలా కాదు. దీనిని ఆక్సీకరణ కాని టీ. రెగ్యులర్‌గా ఈ టీ తాగితే ప్రీ డయాబెటిస్ వచ్చే ప్రమాదం 53 శాతం తక్కువగా ఉందని, అదే విధంగా టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం 47 శాతం తగ్గిందని పరిశోధకులు చెబుతున్నారు. దీనికి వయస్సు, లింగం, జాతి, బాడీమాస్ ఇండెక్స్ వంటి వాటిని కూడా పరిగణనలోకి తీసుకున్నారు. అయితే, మీరు టీ తాగినప్పుడు అందులో చక్కెర, తేనె వంటి వంటి ఎలాంటి స్వీటెనర్స్ వాడొద్దు. పరిశోధనల్లో.. కొన్ని అధ్యయనాల్లో పాల్గొన్న 1,923 మందికి 436 మందికి డయాబెటిస్ ఉంది. 352 మందికి ప్రీడయాబెటిస్ ఉంది. 1, 135మందికి సాధారణ రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు ఉన్నాయి. టీ తాగడం వల్ల రక్తంలో షుగర్ లెవల్స్ తగ్గినట్లుగా గుర్తించారు.

షుగర్ తగ్గడం.. అధ్యయనాల ప్రకారం డార్క్ టీ తాగితే డయాబెటిస్ ప్రమాదం తగ్గడం, ఇన్సులిన్ నిరోధకత పెరగడం జరుగుతుంది. కాబట్టి, మీ రక్తంలో చక్కెర కంట్రోల్ అవుతుంది. రెండోది మీ మూత్రంలో గ్లూకోజ్ విసర్జనని పెంచుతుంది. దీంతో షుగర్ కంట్రోల్ అవుతుంది.

రోజూ డార్క్ టీ.. రోజూ ఈ టీ తాగితే మాత్రమం సరిపోదు. మీరు మరి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రాసెస్డ్ ఫుడ్స్ తగ్గించుకోవాలి. వీటిలో కొవ్వు, చక్కెర, ఉప్పు ఎక్కువగా ఉంటాయి. అందుకే వాటిని తగ్గించి వాటి బదులు తాజా కూరగాయలు, పండ్లు తీసుకోండి. ఇందులో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ కాంపౌండ్స్ ఎక్కువగా ఉండడంతో షుగర్ లెవల్స్ కంట్రోల్ అవుతుంది. నీరు ఎక్కువగా తాగాలి. ఈ జాగ్రత్తలు తీసుకుంటే షుగర్ లెవల్స్ కంట్రోల్ అవుతుంది.

# ఈజీగా బరువు తగ్గుతారు..








అధిక బరువు అనేది లైఫ్‌స్టైల్ సరిగ్గా లేకపోవడంతో వస్తుంది. దీని వల్ల ఎన్నో సమస్యలు వస్తాయి. కొలెస్ట్రాల్ పెరగడం, హైబీపి, పక్షవాతం, గుండెపోటు వంటి వ్యాధులు వస్తాయి. చాలా మంది బరువు తగ్గడంపై శ్రద్ధ చూపరు. ఊబకాయాన్ని సీరియస్‌గా తీసుకోరు. కానీ, ఇది అనేక సమస్యలకి కారణం. కాబట్టి, బరువు తగ్గాలి. అది ఈజీగా ఎలానో తెలుసుకోండి.

మూడు వారాల్లోనే.. ఆయుర్వేద నిపుణుడు డా. దీక్షా భావ్‌సర్ ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని వెయిట్‌లాస్ రెసిపీస్ గురించి చెబుతున్నారు. మీరు ఈ ఆయుర్వేద బరువు తగ్గించే టిప్స్ ఫాలో అయితే, కేవలం 3 వారాల్లో బరువు తగ్గొచ్చు. ఆయుర్వేద నిపుణుల ప్రకారం బరువు తగ్గడాన్ని ఈజీగా చేయడంలో అల్లం నీరు హెల్ప్ చేస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి కొవ్వుని కరిగించి కార్బోహైడ్రేట్స్ జీర్ణం చేయడానికి, ఇన్సులిన్ ఉపయోగించే శరీర సామర్థ్యాన్ని ఎఫెక్ట్ చేస్తుంది. కాబట్టి, వెయిట్ లాస్ మేనేజ్‌మెంట్‌కి హెల్ప్ చేస్తుంది. సూర్యనమస్కారం.. సూర్య నమస్కార్ అనేది 12 విభిన్న యోగా భంగిమల పూర్తి చక్రం. ఇది ఎన్నో లాభాలని అందిస్తుంది. సూర్య నమస్కారం బరువు తగ్గడానికి కూడా హెల్ప్ చేస్తుంది. ఒక్కసారి సూర్య నమస్కారం సరిగ్గా చేస్తే 13.90 కేలరీలు బర్న్ అవుతాయి. కాబట్టి, రెగ్యులర్‌గా 12 సార్ల చేయాలని నిపుణులు చెబుతున్నారు. కపాలభాతి.. ప్రాణాయామం బరువు తగ్గడానికి మంచిది. ఇది నేరగా మన శరీర జీవక్రియ రేటు, ప్రేగు ఆరోగ్యం, జీవక్రియకి సంబంధించిన సమస్యలు దూరం చేసేందుకు రెగ్యులర్‌గా 10 నుంచి 15 నిమిషాల పాటు ఈ ప్రాణాయామాన్ని చేస్తే త్వరగా రిజల్ట్ ఉంటుంది. వాకింగ్.. ఉదయం, సాయంత్రం 40 నుంచి 50 నిమిషాల పాటు నడవడం వల్ల అధికబరువు తగ్గుతారు. ఎందుకంటే ఇది కేలరీలను బర్న్ చేయడానికి హెల్ప్ చేస్తుంది. రెగ్యులర్‌గా నడిస్తే పొట్టలోని కొవ్వు కరిగిపోతుంది. నిపుణులు ప్రకారం.. బరువు తగ్గడంలో డైట్ కూడా కీ రోల్ పోషిస్తుంది. మరీ ముఖ్యంగా సూర్యోదయం తర్వాత, సూర్యాస్తమయానికి ముందే తినడం వల్ల త్వరగా బరువు తగ్గుతారు. దీనిని ఇంటర్మీటెంట్ ఫాస్టింగ్ అనొచ్చు. అంటే ఉదయం 9 స్టార్ట్ చేస్తే 5 ముగించడం, 10కి తింటే 6కి లాస్ట్ మీల్, 7 అయితే, 11కి లాస్ట్ మీల్ ఉండాలి. ఇలా కొన్ని టిప్స్ పాటించడం వల్ల త్వరగా బరువు తగ్గుతారు.

# చెమట పడుతుందా..



చాలా మందికి ఏ కాలమైనా సరే చేతలు, కాళ్ళల్లో చెమట ఎక్కువగా పడుతుంది. ఇది సమస్యలా కనిపిస్తుంది. దీని వల్ల ఏ వస్తువులు పట్టుకున్నా కూడా ఇబ్బందిగా ఉంటుంది. అందుకే ఈ సమస్యని తగ్గించేందుకు ఎలాంటి టిప్స్ పాటించాలో చూద్దాం. సాధారణంగా ఎక్కువగా పరుగెత్తినా, నడిచినా, కష్టమైన బరువు మోసినా చెమటలు వస్తుంటాయి. కానీ, మరికొంతమందికి ఏం చేయకపోయినా అరచేతులు, పాదాలకు చెమటలు వస్తాయి. అలాంటి వారు బూట్లు, చెప్పులు వేసుకున్నా జారుతుంటాయి. దీని వల్ల చాలా ఇబ్బందిగా ఉంటుంది. దీనికోసం కొన్ని టిప్స్ ఫాలో అయిపోవచ్చు. అవేంటో ఇప్పుడు చూద్దాం. ముందుగా మీరు చేతులు, కాళ్ళని శుభ్రంగా క్లీన్ చేయాలి. ఇందుకోసం ఎక్కువగా హార్డ్ స్మెల్ వచ్చే సోప్స్ కాకుండా మైల్డ్ సోప్స్ వాడొచ్చు. దీని వల్ల చాలా వరకూ సమస్య తగ్గుతుంది. యాంటీ పెర్స్పిరెంట్స్.. ఇవి మెడికల్ షాపుల్లో దొరుకుతాయి. ఇవి పాదాలు, చేతుల కోసమే తయారైన ఓ లిక్విడ్. దీనికి అల్యూమినియం క్లోరైడ్ చేతులు, కాళ్ళలో చెమట ఉత్పత్తిని తగ్గిస్తుంది. ఇక కాళ్ళకి చెమట వచ్చే వారు గట్టిగా ఉండే షూ వేసుకోవడం మంచిది కాదు. వదులుగా ఉండేవాటిని తీసుకోవాలి. తేలికైన పదార్థాలతో తయారైన షూ వేసుకోవాలి. అరికాళ్ళలో చెమట వచ్చే వారు సాక్స్ ఎంచుకునేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. నీటిని పీల్చుకునే మృదువుగా కాటన్ సాక్స్‌లు వాడడం మంచిది. ఇది అదనపు చెమటను గ్రహిస్తుంది. చేతులు, కాళ్ళ నుండి అదనపు చెమటను పీల్చడానికి టాల్కమ్ పౌడర్ వాడొచ్చు. వీటితో పాటు మొక్కజొన్న పిండిని కూడా వాడొచ్చు. దీని వల్ల అదనపు తేమ తగ్గుతుంది. చేతులు, కాళ్ళు ఎక్కువగా చెమట పట్టే సమస్య ఉన్నవారు బ్లాక్ టీ వాడొచ్చు. బ్లాక్ టీ డికాషన్‌లో అరచేతులు, అరికాళ్ళని 20, 30 నిమిషాలు ఉంచండి. ఇందులో ఆస్ట్రింజెంట్ లక్షణాలు అరచేతులు, పాదాల్లో అధిక చెమటని తగ్గిస్తాయి. యాపిల్ సైడర్ వెనిగర్ నీటిలో మిక్స్ చేసి అందులో చేతులు, కాళ్ళు 15 నిమషాల పాటు ఉంచండి. తర్వాత క్లీన్ చేయండి.

# ఏ బిందీ పెట్టుకుంటే మంచిదంటే..



బొట్టు.. ఇంతకుముందు కాలంలో అయితే కుంకుమ పెట్టుకునే వారు. కాలం మారేకొద్దీ ఇది ఫుల్ ట్రెండీగా మారిపోయింది. ఇందులోనే ముఖాకృతిని బట్టి ఎలాంటి స్టిక్కర్స్ ఎంచుకోవాలో ఇలా తెలుసుకోండి. వీటి వల్ల మీ ఫేస్ షేప్‌ని బట్టి చక్కని బిందీని ఎంచుకోవచ్చు. బొట్టు.. ముఖానికి అందాన్నివ్వడంలో ఈ బొట్టు కీ రోల్ పోషిస్తుంది. నేడు మార్కెట్‌లో ఎన్నో రకాల, రంగుల ఆకారాల బిందీలు దొరుకుతున్నాయి. వీటన్నింటిని మీరు కూడా స్టైల్ చేయాలనుకుంటున్నారా. ఇక్కడ కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. మీ ఫేస్ షేప్‌ని బట్టి చక్కని బిందీని ఎంచుకోవాలి. అప్పుడే మంచి లుక్ వస్తుంది. మరి ఆ టిప్స్ ఏంటో చూద్దాం. మీ ఫేస్ షేప్ గుండ్రంగా ఉంది. కానీ, మీరు అలాంటి గుండ్రంగా ఉండేవాటిని ఎంచుకోవద్దు. మీరు చక్కగా పొడుగ్గా ఉండే కొన్ని బిందీలు ఎంచుకోవచ్చు. దీని వల్ల మీ లుక్ ఎలివేట్ అవుతుంది. చూడ్డానికి నీట్‌గా కనిపిస్తుంది. హార్ట్ షేప్.. ఈ ఫేస్ షేప్ ఉన్నవారి నుదురు, గడ్డం చదునుగా ఉంటుంది. కాబట్టి, వీరు కూడా గుండ్రంగా ఉండే వాటిని ఎంచుకుంటే నుదురు మరీ పెద్దగా అనిపిస్తుంది. కాబట్టి, చిన్న గుండ్రంగా ఉండే బిందీలు పెట్టుకోవాలి. డైమండ్ షేప్.. వీరికి నుదురు చిన్నగా ఉంటుంది. గడ్డం, ముఖాకృతి చక్కగా ఉంటుంది. వీరు మరీ ఎక్కువగా డిజైన్స్ ఉండేవాటి కాకుండా సింపుల్‌గా ఉండే బిందీలు పెట్టుకోవడం మంచిది.. ఓవల్ షేప్.. ఓవల్ షేప్ ఉన్నవారికి నుదురు, గడ్డం ఉండేవారికి పొడుగ్గా ఉండే బిందీల కంటే గుండ్రంగా ఉండే ఎలాంటి బిందీలైనా ఎంచుకోవచ్చు. వీరికి ఇవి సరిగ్గా సరిపోతాయి. చతురస్రాకారంగా.. చతురస్రాకారం ఫేస్ షేప్ ఉన్నవారు కూడా అన్ని డిజైన్స్ కాకుండా మంచి హైలైట్‌గా ఉండే గుండ్రని, చంద్రుని ఆకారంలో ఉన్న బిందీలు పెట్టుకోవచ్చు. దీని వల్ల మీ ముఖం చూడ్డానికి చక్కగా కనిపిస్తుంది. కొన్ని గుర్తుంచుకోవాలి.. అయితే, మ్యాచింగ్ బిందీ పెట్టుకోవడం అనేది ఇంతకు ముందు ఫ్యాషన్. ఇప్పుడు కాంట్రాస్ట్ కూడా పెట్టుకోవచ్చు. మీరు వేసుకునే డ్రెస్‌లో ఏదైనా చిన్న మ్యాచింగ్ ఉన్న కలర్ బిందీ పెట్టుకోండి. దీంతో మీ బిందీ ఎలివేట్ అవుతుంది. కాబట్టి, ఇలాంటి కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అదే విధంగా మీరు ఎప్పుడు ఒకేలా కాకుండా కొన్ని ట్రై చేస్తుండాలి. దీంతో మీకే అర్థమవుతుంది. మీకు ఎలాంటి డిజైన్స్ నచ్చుతాయో. అదే విధంగా బిందీలను కొనేటప్పుడు మంచి బ్రాండ్‌వి కొనాలి. దీంతో ఎక్కువసేపు అవి ఉంటాయి. కొన్ని బిందీలు త్వరగా ఊడిపోతుంటాయి. అలా కాకుండా ఉండాలంటే పౌడర్ రాయాలి. టాల్కమ్ పౌడర్, కాంపాక్ట్ పౌడర్ వంటివి రాయాలి. ఆ తర్వాత బిందీ పెట్టాలి. అప్పుడు ఆ బిందీ ఎక్కువసేపు ఉంటుంది.

# కొబ్బరినూనెతో..!



కొబ్బరి నూనెను కేశ సంరక్షణకు ఎక్కువగా వాడుతుంటాం. చాలా ప్రాంతాల్లో దీన్ని వంటకు కూడా వాడుతుంటారు. కొబ్బరినూనె మన డైట్?లో చేర్చుకుంటే.. అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. కొబ్బరి నూనె మన నోటి పరిశుభ్రతను కాపాడుకోవడానికీ మీకు తెలుసా..? కొబ్బరి నూనెలో యాంటీమైక్రోబయల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ నోటి ఆరోగ్యాన్ని కాపాడటానికి తోడ్పడతాయి. దంత క్షయాన్ని నివారించవచ్చు.. కొబ్బరి నూనె స్ట్రెప్టోకోకస్ మ్యూటాన్స్ వంటి నోటి బ్యాక్టీరియాను నాశనం చేయడానికి సహాయపడుతుంది. స్ట్రెప్టోకోకస్ మ్యూటాన్స్ దంత క్షయానికి, కావిటీస్‌కు ఇది ప్రధాన కారణం. నోటి దుర్వాసన తగ్గిస్తుంది.. కొబ్బరి నూనెలో లారిక్ యాసిడ్ ఉంటుంది, దీనిలో యాంటీమైక్రోబయల్ గుణాలు ఉంటాయి. ఈ సంతృప్త కొవ్వు హెలికోబాక్టర్ పైలోరీ, హెలిటోసిస్ (దుర్వాసన)కి దోహదపడే బ్యాక్టీరియా వృద్ధిని నిరోధించడానికి తోడ్పడుతుంది.చిగురువాపుకు చికిత్స చేస్తుంది..కొబ్బరి నూనె చిగుళ్ల వ్యాధి, చిగుళ్లలో మంట, చికాకు కలిగించే చిగుళ్ల వ్యాధికి చికిత్స చేస్తుంది. చిగుళ్ల వాపు కారణంగా, దంత నష్టం జరిగే అవకాశం ఉంది. టూత్ సెన్సిటివిటీని తగ్గిస్తుంది.. కొబ్బరి నూనెలోని ఫ్యాటీ యాసిడ్స్‌లో యాంటీమైక్రోబయ ల్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. ఇవి నోటిలోని బ్యాక్టీరియాను తొలగిస్తాయి, ఫలకం ఏర్పడకుండా నిరోధిస్తాయి. కొబ్బరి నూనె.. పళ్ల సెన్సిటివిటీని కూడా తగ్గిస్తుంది. కొబ్బరి నూనెను ఉపయోగించడం వల్ల చిగుళ్లు, దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి.

# ప్రైవేటుకు ఎయిర్‌పోర్టులు?..

**వచ్చే ఏడాది మార్చినాటికి అమ్మేయనున్న కేంద్రం!**



విమానాశ్రయాల ప్రైవేటీకరణను మోదీ సర్కారు మళ్లీ మొదలుపెట్టింది. ప్రభుత్వ ఆస్తుల నగదీకరణ నుంచి పెద్ద ఎత్తున ఆదాయాన్ని పొందాలన్న లక్ష్యం పెట్టుకున్న కేంద్రం.. ఏకంగా వచ్చే ఏడాది మార్చికల్లా దేశంలోని 13 ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది.

విమానాశ్రయాల ప్రైవేటీకరణను మోదీ సర్కారు మళ్లీ మొదలుపెట్టింది. ప్రభుత్వ ఆస్తుల నగదీకరణ నుంచి పెద్ద ఎత్తున ఆదాయాన్ని పొందాలన్న లక్ష్యం పెట్టుకున్న కేంద్రం.. ఏకంగా వచ్చే ఏడాది మార్చికల్లా దేశంలోని 13 ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఈ అంశాన్ని ఇంటర్-మినిస్టీరియల్ కన్సల్టేషన్‌లో ప్రస్తావనకు తీసుకొచ్చినట్టు కూడా చెప్తున్నారు.

జాతీయ నగదీకరణ ప్రణాళిక కింద 2022 నుంచి 2025 వరకు మొత్తం దేశవ్యాప్తంగా 25 ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌పరం చేయాలని కేంద్రం నిర్ణయించుకున్నది. వీటిలో భువనేశ్వర్, వారణాసి, అమృత్‌సర్, తిరుచ్చి, ఇండోర్, రాయ్‌పూర్, కాలీకట్, కోయంబత్తూర్, నాగ్‌పూర్, పాట్నా, మధురై, సూరత్, జోధ్‌పూర్, రాంచీ, చెన్నై, విజయవాడ, రాజమండ్రి, వడోదర, భోపాల్, తిరుపతి, హుబ్లీ, ఇంపాల్, అగర్తల, డెహ్రాడూన్, ఉదయ్‌పూర్ ఉన్నాయి. ఈ క్రమంలోనే ముందుగా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బోర్డు (ఏఏఐ) 13 ఎయిర్‌పోర్టులను గుర్తించింది. దీంతో వీటి ప్రైవేటీకరణకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కేబినెట్ అనుమతికి సిద్ధమైంది. అయితే మధ్యప్రదేశ్ ప్రభుత్వం.. రాయ్‌పూర్, ఇండోర్ విమానాశ్రయాల ప్రైవేటీకరణకు అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో సదరు జాబితా 11 ఎయిర్‌పోర్టులకు తగ్గింది. ఈలోగా గత ఏడాది లోక్‌సభ ఎన్నికలు రావడంతో ప్రైవేటీకరణకు బ్రేక్ పడింది. కానీ మూడోసారీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే కొలువుదీరడంతో ఇప్పుడిక మళ్లీ విమానాశ్రయాల ప్రైవేటీకరణపై సర్కారు పెద్దలు దృష్టి సారించారు.

> ప్రభుత్వ ఆస్తుల నగదీకరణ నుంచి పెద్ద ఎత్తున ఆదాయాన్ని పొందాలన్న లక్ష్యం పెట్టుకున్న కేంద్రం.. ఏకంగా వచ్చే ఏడాది మార్చికల్లా దేశంలోని 13 ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది.

ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణపై రాష్ట్రాల నుంచి గట్టిగానే విమర్శలు వస్తున్నాయి. లాభాల్లో ఉన్న విమానాశ్రయాలు ఈ దెబ్బతో నష్టాల్లోకి జారుకుంటాయని, ప్రైవేట్ రంగంలో కొన్ని బడా కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యంలోకి దేశీయ విమానయాన పరిశ్రమ వెళ్లిపోతుందన్న వాదనలూ వినిపిస్తున్నాయి. ప్యాసింజర్లపై అనవసరపు చార్జీలు వచ్చిపడతాయని, పారదర్శకత లోపిస్తుందని అంటున్నారు. ముఖ్యంగా అదానీ గ్రూప్ కోసమే ఈ ప్రైవేటీకరణ తంతు అన్న ఆరోపణలూ వస్తున్నాయి. ఇక ఇప్పటికే వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఈ నెల 1న పార్లమెంట్‌లో ప్రకటించిన బడ్జెట్‌లో.. రాబోయే ఐదేండ్లలో ప్రభుత్వ ఆస్తులను అమ్మి రూ.10 లక్షల కోట్లను ఖజానాకు తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణ తిరిగి పట్టాలెక్కుతున్నది. ఇదిలావుంటే ప్రైవేటీకరణ ప్రక్రియలో భాగంగా తొలిసారి 6 పెద్ద ఎయిర్‌పోర్టులతో 7 చిన్న ఎయిర్‌పోర్టులను కలిపేయాలని భావిస్తున్నారు. వారణాసితో ఖుషీనగర్-గయా, అమృత్‌సర్‌తో కంగ్రా, భువనేశ్వర్‌తో తిరుపతి, రాయ్‌పూర్‌తో ఔరంగాబాద్, ఇండోర్‌తో జబల్‌పూర్, తిరుచిరాపల్లితో హుబ్లీ క్లబ్ చేయాలని చూస్తున్నారు.

# ఈ వృద్ధితో ఉద్యోగాలు పుట్టవ్



ఇటీవలికాలంలో బలహీనపడ్డ భారత ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. ఇప్పటికే అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఆర్బీఐ, ఇంకోవైపు ఆయా రేటింగ్ ఏజెన్సీలు కూడా ఇదే అంచనాల్ని వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.

ఇటీవలికాలంలో బలహీనపడ్డ భారత ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. ఇప్పటికే అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఆర్బీఐ, ఇంకోవైపు ఆయా రేటింగ్ ఏజెన్సీలు కూడా ఇదే అంచనాల్ని వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈసారి జీడీపీ వృద్ధిరేటు అంచనాలను కూడా పెంచుతున్నాయి. అయితే ఈ అంచనాలు ఏమంత గొప్పగా లేవని రాజన్ పెదవి విరిచారు. ప్రస్తుతం చికాగో యూనివర్సిటీ బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రాజన్.. తాజాగా ఓ బ్లూంబర్గ్ టెలివిజన్ ప్రతినిధికి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగానే మాట్లాడుతూ.. దేశ జీడీపీ గాడినపడుతున్నదని ఆనందించాల్సిన అవసరం లేదని, ఇప్పుడున్న వృద్ధి అంచనాలు.. కొత్తగా జాబ్ మార్కెట్‌లోకి రాబోయే వాళ్లకు సరిపడా ఉద్యోగాలను సృష్టించలేవని తేల్చిచెప్పారు.

ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో దేశ జీడీపీ వృద్ధిరేటు 6 శాతానికిపైగానే ఉంటుందన్న అంచనాలు విస్తృతంగా వస్తున్న సంగతి విదితమే. బ్లూంబర్గ్ సర్వేలో ఆర్థికవేత్తలు సైతం ఇదే చెప్పారు. జూలై-సెప్టెంబర్‌తో పోల్చితే (నాడు ఏడు త్రైమాసికాల కనిష్ఠ స్థాయిని తాకుతూ 5.4 శాతంగా నమోదైంది) ఇది ఎక్కువే. అయినప్పటికీ భారత్ ఇంకా మెరుగైన వృద్ధిరేటును సాధించవచ్చని రాజన్ అభిప్రాయపడ్డారు. ఇంకో 2 శాతం పెరిగి 8 శాతం స్థాయిని అందుకోవాలని, అప్పుడే ఏటా మార్కెట్‌లోకి వస్తున్న నిరుద్యోగ యువతకు తగ్గ ఉద్యోగావకాశాలను సృష్టించగలమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత జనాభా కలిగిన భారత్‌కు ఇప్పుడున్న స్థాయి వృద్ధి సరికాదన్నారు. కాగా, ఈ శుక్రవారం అక్టోబర్-డిసెంబర్‌కుగాను దేశ జీడీపీ గణాంకాలు అధికారికంగా విడుదల కానున్నాయి.

మందగించిన దేశ జీడీపీ వృద్ధిరేటును పరుగులు పెట్టించేందుకు దాదాపు ఐదేండ్ల తర్వాత ఆర్బీఐ ఇటీవలి ద్రవ్యసమీక్షలో కీలక వడ్డీరేటును పావు శాతం కోత పెట్టినది తెలిసిందే. ఈ నెలారంభంలో కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా రెపో రేటును 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తెచ్చారు. దీంతో ఆయా బ్యాంకులూ తమ రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి. అయితే ఎకానమీని బలపర్చేందుకు ఈ నిర్ణయం ఒక్కటే చాలదని రాజన్ వ్యాఖ్యానించారు. యువతలో నైపుణ్యాభివృద్ధికి దోహదం చేసే చర్యలు కూడా తీసుకోవాల్సి ఉందన్నారు. ఉద్యోగావకాశాలు ఎంతగా పెరిగితే ఆర్థిక వ్యవస్థ కార్యకలాపాలు అంత గట్టిగా సాగుతున్నట్టవుతుందన్నారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తమ దేశంలోకి దిగుమతయ్యే వస్తు,సేవలపై అధిక సుంకాలను ప్రకటిస్తున్నది చూస్తూనే ఉన్నాం. ఈ కారణంగానే దేశీయ స్టాక్ మార్కెట్లు సైతం తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. అయితే ఈ సుంకాలపై రాజన్ స్పందిస్తూ.. అమెరికాతో సత్సంబంధాలు లాభదాయకమని, ఆ దేశం నుంచి చమురు, రక్షణపరమైన కొనుగోళ్లను పెంచడం మంచిదని అభిప్రాయపడ్డారు. అలాగే చాలా వస్తూత్పత్తులపై భారత్ సుంకాలను తగ్గించే వీలుందన్నారు. నిజానికి దీనివల్ల దేశ వృద్ధిరేటు ప్రగతికి వచ్చే నష్టమేమీ లేదన్న ఆయన.. పైగా పరిశ్రమలో పోటీ వాతావరణం నెలకొంటుందని, అది మంచిదేనని వ్యాఖ్యానించారు. ఇక ఆర్బీఐ గవర్నర్‌గా 2013 నుంచి 2016 వరకు రాజన్ పనిచేశారు.



# ఎట్టకేలకు లాభాల్లోకి సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు లాభాల్లోకి మళ్లాయి. వరుసగా ఐదు రోజులుగా పతనమైన సూచీలకు ఫైనాన్షియల్, ఎఫ్ఎంసీజీ షేర్ల నుంచి లభించిన మద్దతుతో తిరిగి కోలుకున్నాయి. ఇంట్రాడేలో 300 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 147.71 పాయింట్ల లాభంతో 74,602 వద్ద నిలిచింది. దేశీయ స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు లాభాల్లోకి మళ్లాయి. వరుసగా ఐదు రోజులుగా పతనమైన సూచీలకు ఫైనాన్షియల్, ఎఫ్ఎంసీజీ షేర్ల నుంచి లభించిన మద్దతుతో తిరిగి కోలుకున్నాయి. ఇంట్రాడేలో 300 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 147.71 పాయింట్ల లాభంతో 74,602 వద్ద నిలిచింది. మరో సూచీ నిఫ్టీ మాత్రం వరుసగా ఆరోరోజూ నష్టపోయింది. 5.80 పాయింట్లు కోల్పోయి 22,547.55 వద్దకు జారుకున్నది. ఫార్మా, మెటల్, ఐటీ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడంతో సూచీ తగ్గుముఖం పట్టింది. మార్కెట్లో మహీంద్రా అండ్ మహీంద్రా 2.61 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. జొమాటో, నెస్లె, బజాజ్ ఫిన్‌సర్వ్, మారు తి, టైటాన్ షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, సన్ ఫార్మా, పవర్ గ్రిడ్, టీసీఎస్, టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, టాటా మోటర్స్ షేర్లు నష్టపో యాయి. గత ఐదు సెషన్లలో సెన్సెక్స్ 1,542.45 పాయింట్లు లేదా 2 శాతం నష్టపోయిన విషయం తెలిసిందే.

# తులం ధర ఎంతకు చేరిందంటే..?

రూపాయి పతనం నేపథ్యంలో వరుసగా రెండోరోజూ బంగారం ధర పెరిగింది. పసిడి ధర రూ.250 పెరగడంతో తులం ధర రూ.89,350కి చేరుకుందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. ఇక 22 క్యారెట్ల గోల్డ్ రూ.250 పెరిగి పది గ్రాములకు రూ.88,950కి చేరుకుంది. ఇక వెండి ధరలు మాత్రం రూ.500 తగ్గి కిలోకు రూ.99,500 పలుకుతున్నది. రూపాయి పతనం నేపథ్యంలో వరుసగా రెండోరోజూ బంగారం ధర పెరిగింది. పసిడి ధర రూ.250 పెరగడంతో తులం ధర రూ.89,350కి చేరుకుందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. ఇక 22 క్యారెట్ల గోల్డ్ రూ.250 పెరిగి పది గ్రాములకు రూ.88,950కి చేరుకుంది. ఇక వెండి ధరలు మాత్రం రూ.500 తగ్గి కిలోకు రూ.99,500 పలుకుతున్నది. డాలర్ ఇండెక్స్ పెరుగుల కారణంగా వెండి ధర తగ్గిందని మెహతా ఈక్విటీస్ లిమిటెడ్ కమోడిటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలాంత్రి పేర్కొన్నారు. ట్రంపు సుంకాల భయాలు, ఒత్తిడి కారణంగా ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు సైతం ఇబ్బందులుపడుతున్నాయి. అయితే, యూఎస్ ట్రెజరీ దిగుబడిలో తిరోగమనం వెండి ధరలు పెరుగుదల తక్కువగానే ఉండవచ్చని అంచనా. వాణిజ్య సుంకాలపై అనిశ్చితి మధ్య.. యూఎస్ డాలర్‌తో పోలిస్తే మంగళవారం రూపాయి 51 పైసలు తగ్గి రూ.87.23 వద్ద ముగిసింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (%వీజశ%)లో ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో ఏప్రిల్ డెలివరీకి సంబంధించిన బంగారం కాంట్రాక్ట్ ధర 10 గ్రాములకు రూ.275 పెరిగి రూ.86,459కి చేరుకుంది. అదే సమయంలో కామెక్స్ బంగారం 2,930 నుంచి 2,955 మధ్య ట్రేడయ్యింది. మరోవైపు మార్చి డెలివరీకి సంబంధించిన వెండి ఫ్యూచర్స్ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో కిలోకు రూ.241 పెరిగి రూ.95,330కి చేరుకుంది. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ కమోడిటీ అనలిస్ట్ సౌమిల్ గాంధీ మాట్లాడుతూ.. మంగళవారం విడుదల కానున్న సీబీ కన్స్యూమర్ కాన్ఫిడెన్స్ ఇండెక్స్, రిచ్‌మండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇండెక్స్‌తో సహా స్థూల డేటా.. బులియన్ ధరలకు దిశానిర్దేశం చేసే యూఎస్ ఫెడరల్ రిజర్వ్‌లోని కొంతమంది సభ్యుల ప్రసంగాల కోసం వ్యాపారులు ఎదురు చూస్తున్నారన్నారు. దేశంలోని వివిధ నగరాల్లోని ధరలను పరిశీలిస్తే.. చెన్నైలో 22 క్యారెట్స్ గోల్డ్ రూ.80,750 ఉండగా.. 24 క్యారెట్స్ పసిడి ధర రూ.88,090 ధర పలుకుతున్నది. ముంబయిలో 22 క్యారెట్స్ బంగారం రూ.80,750 ఉండగా.. 24 క్యారెట్ల పుత్తడి రూ.88,090 ధర ఉన్నది.

# కుప్పకూలిన ఆర్మీ విమానం.. 46 మంది సైనికులు దుర్మరణం



సైనికులతో వెళ్తున్న విమానం కుప్పకూలిపోయింది. ఎయిర్‌బేస్ నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఆ విమానం.. జనావాసాల మధ్య కూలింది. ఈ ఘటనలో 46 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఇంకా స్థానికులు కూడా చనిపోయినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. అయితే గాల్లోకి ఎగిరిన ఆర్మీ విమానం.. ఎందుకు కూలిపోయింది అనేది ఇంకా అంతుచిక్కడం లేదు. సూడాన్‌లో ఘోర విమాన ప్రమాదం చోటు చేసుకుంది. ఆర్మీ విమానం కూలిపోయింది. వైమానిక స్థావరం నుంచి బయలుదేరిన విమానం టేకాఫ్ అయిన కాసేపటికే కూలిపోవడం గమనార్హం. ఇక ఈ ఘోర విమాన ప్రమాదంలో ఆ విమానంలో ప్రయాణిస్తున్న 46 మంది జవాన్లు మృతి చెందారు. అంతేకాకుండా ఆ విమానం ఇళ్ల మధ్యలో కుప్పకూలిపోవడంతో స్థానిక ప్రజలు కూడా ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 10 మందికిపైగా గాయాలపాలైనట్లు సూడాన్ అధికారులు వెల్లడించారు. సహాయక చర్యలు కొనసాగుతుండగా.. మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతున్నట్లు తెలిపారు.

మంగళవారం సూడాన్‌లోని వాడి సయిద్నా వైమానిక స్థావరం నుంచి ఓ ఆర్మీ విమానం టేకాఫ్ అయింది. అయితే కొద్దిసేపటి తర్వాత ఆ విమానం రాడార్ నుంచి సిగ్నల్స్ కట్ అయిపోయాయి. ఈ క్రమంలోనే ప్రజలు నివసించే ప్రాంతాల్లో కూలిపోయింది. ఈ ఘటనలో విమానంలో వెళు_న్న 46 మంది సైనికులు ప్రాణాలు విడిచారు. అంతేకాకుండా విమానం కూలిపోవడంతో అక్కడ ఉన్న స్థానికులు కూడా కొందరు మరణించారు. ఇక ఈ ఘటనలో 10 మందికి పైగా గాయపడినట్లు సూడాన్ అధికారులు బుధవారం వెల్లడించారు. అయితే ఈ ప్రాంతంలో సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు అధికారులు వివరించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటికి తీస్తున్నట్లు తెలిపారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ సైనిక విమానం ఎలా కూలిపోయింది.. అసలు ఈ ప్రమాదానికి గల కారణాలు ఏంటి అనేది మాత్రం ఇంకా తెలియరాలేదు. మరోవైపు.. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

ఇక సూడాన్‌లో గత కొంత కాలంగా అంతర్యుద్ధం కొనసాగుతోంది. సూడాన్‌పై పట్టు సాధించడం కోసం సూడాన్ సైన్యం, పారామిలిటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ మధ్య జరుగుతున్న అంతర్యుద్ధం ఇటీవలి కాలంలో మరింత తీవ్రరూపం దాల్చింది. ఈ నేపథ్యంలోనే న్యాలా ప్రాంతంలో ఇటీవల ఒక సైనిక విమానాన్ని కూల్చివేసినట్లు డార్ఫర్ పశ్చిమ ప్రాంతాన్ని పాలిస్తున్న ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్-ఆర్ఎస్ఎఫ్ ప్రకటించింది. అయితే ప్రస్తుతం జరిగిన విమాన ప్రమాదానికి.. సూడాన్ అంతర్యుద్ధానికి ఏదైనా సంబంధం ఉందా అని సూడాన్ అధికారులు విచారణ జరుపుతున్నారు. గతంలో లాగే ఈ సైనిక విమానాన్ని కూడా ఆర్ఎస్ఎఫ్ కూల్చివేసిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.



# ప్రభుత్వ చాట్ టూల్‌లో గలీజు పనులు.. 100 మందికిపై నిఘా అధికారులపై వేటు!

కీలక ప్రభుత్వ సమాచార మార్పిడి కోసం నిర్దేశించిన టూల్‌ను కొందరు నిఘా అధికారులు అశ్లీల మేసేజ్‌లు చాటింగ్ కోసం వేదికగా మార్చుకున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఓ సామాజిక హక్కుల కార్యకర్త ఈ భాగోతాన్ని బయటపెట్టారు. దీంతో ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. వెంటనే అటువంటి అధికారులు గుర్తించాలని ఆదేశాలు జారీచేసిన ఎన్ఎస్ఏ డైరెక్టర్.. చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం అగ్రరాజ్యం అమెరికాలో సంచలనంగా మారిన ఈ వ్యవహారంపై దర్యాప్తునకు ఆదేశించారు.

అతి ముఖ్యమైన సమాచార మార్పిడి కోసం నిర్దేశించిన చాట్ టూల్‌ను అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుకునే వేదికగా మార్చుకున్నారనే ఆరోపణలపై 100 మందికిపై ఇంటెలిజెన్స్ అదికారులపై వేటు వేసేందుకు అమెరికా నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ డైరెక్టర్ తులసీ గబ్బార్డ్ సిద్ధమయ్యారు. అతి సున్నితమైన అంశాలను చర్చించేందుకు వినియోగించే ప్రభుత్వ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన చాట్ టూల్‌లో కొందరు అధికారులు అసభ్యకరమైన సందేశాలను పంపుకుంటున్నట్టు అధికారులు ఇటీవల గుర్తించారు. ఇటువంటి అధికారులపై చర్యలు తీసుకుంటున్నట్లు ఫ్యాక్స్ న్యూస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తులసీ గబ్బార్డ్ వెల్లడించారు.

'చాట్‌టూల్‌లో అభ్యంతరకరమైన మేసేజ్‌లు పంపిన 15 ఏజెన్సీలకు చెందిన 100 మందికి పైగా అధికారులపై చర్యలు తీసుకుంటున్నాం.. వారి భద్రతా క్లియరెన్స్‌ను సైతం తొలగించాలని ఆదేశించాం.. ఇది భద్రతా విభాగం నమ్మకాన్ని, వృత్తిపరమైన నియమాలను ఉల్లంఘించడమే.. ట్రంప్ యంత్రాంగంలో ఇది ఆరంభం మాత్రమే.. క్షేత్రస్థాయిలో అవినీతిని నిర్మూలించి వ్యవస్థను శుభ్రం చేస్తాం.. తిరిగి నమ్మకాన్ని తీసుకొస్తాం' అని ఆమె వ్యాఖ్యానించారు. ఈ అసభ్యకరమైన చాటింగ్‌లో పాల్గొన్న అధికారులను శుక్రవారంలోగా గుర్తించాలని తులసీ గబ్బార్డ్ జారీ చేసిన ఉత్తర్వుల కాపీని ఎన్ఎస్ఏ కార్యాలయ ప్రతినిధి ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టు చేశారు. అటు, ప్రభుత్వ చాట్ టూల్‌ను కొందరు అధికారులు దుర్వినియోగం చేయడాన్ని సహించేది లేదని ఎన్ఎస్ఏ స్పష్టం చేసింది. వారిని విధుల నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్ఎస్ఏ, డీఎన్ఐలు ఎక్స్‌లో పేర్కొన్నాయి. కాగా, చాట్ టూల్‌లో అసభ్యకరమైన మేసేజ్‌లు పంపుతున్న విషయాన్ని తొలుత హక్కుల కార్యకర్త క్రిస్టోఫర్ రూఫో గుర్తించారు. ట్రాన్స్ జెండర్‌లకు చెందిన మెసేజ్‌లు ప్రభుత్వ చాట్‌టూల్ ఇంటర్‌లింక్‌లో కనిపించినట్లు 'సిటీ జర్నల్'లో రూఫో పేర్కొన్నారు. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో తులసీ గబ్బార్డ్ స్పందించారు.

> ట్రంప్ యంత్రాంగంలో ఇది ఆరంభం మాత్రమే.. క్షేత్రస్థాయిలో అవినీతిని నిర్మూలించి వ్యవస్థను శుభ్రం చేస్తాం.. తిరిగి నమ్మకాన్ని తీసుకొస్తాం' అని ఆమె వ్యాఖ్యానించారు. ఈ అసభ్యకరమైన చాటింగ్‌లో పాల్గొన్న అధికారులను శుక్రవారంలోగా గుర్తించాలని తులసీ గబ్బార్డ్ జారీ చేసిన ఉత్తర్వుల కాపీని ఎన్ఎస్ఏ కార్యాలయ ప్రతినిధి ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టు చేశారు. అటు, ప్రభుత్వ చాట్ టూల్‌ను కొందరు అధికారులు దుర్వినియోగం చేయడాన్ని సహించేది లేదని ఎన్ఎస్ఏ స్పష్టం చేసింది.

మరోవైపు, బైడెన్ హయాంలో సీఏఐ, ఎన్ఎస్ఏలోని వైవిధ్య కార్యక్రమాల్లో పనిచేసిన ఉద్యోగులను తొలగిస్తూ జారీచేసిన ఉత్తర్వులను ఫెడరల్ జడ్జ్ తాత్కాలికంగా నిలిపివేశారు. దీనిపై గురువారం తీర్పు వెలువడే అవకాశం ఉంది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ పలువురు ఉద్యోగులను వేర్వేరు కోర్టుల్లో వ్యాజ్యాలు దాఖలు చేశారు.

# నిర్భయ తరహా ఘటన.. బస్సులో మహిళపై అత్యాచారం..

ఆర్టీసీ బస్సులోనే మహిళపై అత్యాచారానికి ఓ దుండగుడు తెగబడ్డాడు. అది కూడా పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ దారుణం చోటు చేసుకోవడం గమనార్హం. ఢిల్లీలో నిర్భయ తరహాలోనే బస్సులో మహిళపై అత్యాచారం చేసిన ఘటన.. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతోంది. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం.. నిందితుడికి ఉరిశిక్షే సరైందని పేర్కొన్నారు. నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని సీఎం తెలిపారు. ఇక ఈ ఘటనతో ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.

మహారాష్ట్రలోని పూణే నగరంలో ఘోరం చోటు చేసుకుంది. పోలీస్ స్టేషన్‌కు 100 మీటర్ల దూరంలోనే ఆగి ఉన్న ఆర్టీసీ బస్సులో ఓ మహిళపై అత్యాచారం జరిగింది. ఈ ఘటన మహారాష్ట్రలో సంచలనంగా మారింది. రద్దీగా ఉండే బస్టాండ్ పక్కనే ఈ దారుణం చోటు చేసుకోవడంతో ప్రభుత్వం తీరుపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి. మహారాష్ట్రలో శాంతి భద్రతలు క్షీణించాయంటూ మండిపడుతున్నాయి. దీంతో ఈ అత్యాచార ఘటన కాస్తా రాజకీయ రంగు పులుముకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించారు. త్వరలోనే ఆ నిందితుడిని పట్టుకుంటామని మహారాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది.

పూణేలోని నిత్యం రద్దీగా ఉండే స్వర్‌గేట్ బస్టాండ్‌లో ఈ ఘటన జరిగింది. సతారా జిల్లాలోని ఫల్తానా ప్రాంతానికి చెందిన ఓ మహిళ.. పూణేలోని ఇళ్లలో పని చేసుకుని జీవనం సాగిస్తూ ఉంటుంది. ఈ క్రమంలోనే మంగళవారం తెల్లవారుజామున ఆమె స్థానికంగా ఉన్న పోలీస్ స్టేషన్‌కు 100 మీటర్ల దూరంలో ఉన్న స్వర్‌గేట్ బస్టాండ్‌లో బస్సు కోసం వేచిచూస్తోంది. ఈ క్రమంలోనే ఆమెను గమనించిన ఓ వ్యక్తి.. అక్కడికి వచ్చి.. బస్సు ముందు ఉందంటూ తీసుకెళ్లాడు. అక్కడ అంతా చీకటిగా ఉండగా.. బస్సులో ప్రయాణికులు నిద్రపోతున్నారని.. అందుకే లైట్లు ఆన్ చేయలేదని మహిళను నమ్మించాడు. దీంతో అది నమ్మిన ఆ మహిళ బస్సు ఎక్కగానే.. వెంటనే లోపలికి చేరుకున్న ఆ వ్యక్తి డోర్ వేసి.. ఆ మహిళపై అత్యాచారానికి ఒడిగట్టాడు.

ఆ దారుణం తర్వాత.. బయటికి వచ్చి మరో బస్సు ఎక్కిన ఆ మహిళ.. తనపై జరిగిన అత్యాచార ఘటన గురించి తన స్నేహితురాలికి చెప్పింది. దీంతో ఆ విషయం కాస్తా వెలుగులోకి వచ్చింది. అనంతరం బాధితురాలు పక్కనే ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు అక్కడ ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. వాటి ఆధారంగా నిందితుడు 36 ఏళ్ల దత్తాత్రేయ రాందాస్‌గా గుర్తించారు. గతంలో దత్తాత్రేయ రాందాస్ పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. దీంతో అతడిని పట్టుకునేందుకు 8 స్పెషల్ టీమ్స్‌ను ఏర్పాటు చేశారు.



ఇక ఈ ఘటనపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ స్పందించారు. ఒక ఆడబిడ్డకు ఇలా జరగడం దురదృష్టకరమని.. పేర్కొన్నారు. నేరస్థుడికి ఉరి శిక్ష వేయడమే సరైందని పేర్కొన్నారు. ఆ వ్యవహారాన్ని స్వయంగా పరిశీలించి దర్యాప్తు చేయాలని.. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని పూణే పోలీస్ కమిషనర్‌కు అజిత్ పవార్ ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు.. ఈ ఘటనపై స్పందించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ దీన్ని తీవ్రంగా పరిగణించి పోలీసులను ఆదేశించారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని ట్వీట్ చేశారు. ఇక ఈ ఘటనపై మహారాష్ట్రలోని ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. పూణేలో శాంతి భద్రతలు క్షీణించాయని.. రోజురోజుకూ నేరాలు పెరిగిపోతున్నాయని మండిపడ్డాయి. మహారాష్ట్ర ప్రజలకు రక్షణ కల్పించడంలో దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వం విఫలమైందంటూ ఆరోపించాయి. ప్రమాదం జరిగిన బస్టాప్ వద్ద శివసేన (యూబీటీ) నేతలు నిరసనలు వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్ సమీపంలోనే ఇలాంటి దారుణం జరిగిందని.. చట్టం పట్ల కొందరికి భయం లేకుండా పోయిందని పేర్కొన్నాయి. మహిళకు అన్యాయం జరుగుతుంటే పట్టించుకోలేదని.. పూణేలో నేరాలను అరికట్టడంలో హోంశాఖ విఫలమైందని ఎన్సీపీ (ఎస్పీ) ఆరోపించింది.




# మీతో స్క్రీన్ షేర్ చేసుకోవడం అదృష్టం

### బిగిబి అమితాబ్‌కు బర్త్‌డే విషెస్ చెప్పిన ప్రభాస్



బాలీవుడ్ సూపర్ స్టార్ హీరో అమితాబ్ బచ్చన్ అక్టోబర్ 11న అంటే..శనివారం 83వ ఏడాదిలోకి అడుగు పెట్టారు. ఈ సందర్భంగా అతడికి సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుఉన్నాయి. టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా బిగ్ బీకి బర్త్ డే విషెస్ తెలిపారు. ఈ పోస్టులో 'మీకు దగ్గర ఉండి మీ వర్క్‌ను చూడడం, మీతో కలిసి స్క్రీన్ పంచుకోవడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను.. మీరు ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలి అంటూ రెబల్ స్టార్ ప్రభాస్ విషెస్ చేశారు. ఇక, వీరిద్దరి కాంబినేషన్‌లో గతేడాది విడుదలైన 'కల్కి 2898 ఏడీ' థియేటర్లలో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. భారీ బ్జడెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో అమితాబ్ బచ్చన్.. అశ్వత్థామగా, ప్రభాస్ భైరవగా నటించారు. ప్రస్తుతం దీని సీక్వెల్ పనులు కొనసాగుతున్నాయి. అయితే, ప్రస్తుతం 'కల్కి2'కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. ఈ భారీ ప్రాజెక్ట్ నుంచి ఇప్పటికే దీపిక పదుకొణెను వైజంతి మూవీస్ తొలగించిన విషయం తెలిసిందే. దీంతో కల్కి2 సీక్వెల్‌లో ఆమె పాత్రను ఎవరు పోషిస్తారా అనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ఈ పాత్రలో బాలీవుడ్ క్వీన్ అలియా భట్ నటించనున్నట్లు న్యూస్ వస్తుంది. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన కోసం అభిమానులు వేచి చూస్తున్నారు.



# రౌడీ జనార్ధన్‌గా వస్తున్న విజయ్ దేవరకొండ

వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు విజయ్ దేవరకొండ.. ఈ హీరో మరో చిత్రం 'రౌడీ జనార్దన్' ప్రారంభమైంది. రవి కిరణ్ కోలా దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో విజయ్ సరసన కీర్తి సురేశ్ నటిస్తున్నారు. శనివారం పూజా కార్యక్రమాలతో ఈ సినిమా ప్రారంభమైంది. నిర్మాత అల్లు అరవింద్ కల్‌ఆప్ కొట్టారు. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట షేర్ అవుతున్నాయి. ఈ కార్యక్రమానికి నిర్మాతలు దిల్ రాజు, అల్లు అరవింద్ హాజరయ్యారు. 'రాజావారు రాణిగారు' సినిమాతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన దర్శకుడే రవికిరణ్ కోలా. తొలి మూవీకి భిన్నంగా ఈసారి విజయ్‌తో యాక్షన్‌కు ప్రాధాన్యం ఉన్న కథను తెరకెక్కించనున్నారు. ఈనెల 16 నుంచి ముంబయిలో ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మొదటిసారి విజయ్ సరసన కీర్తి సురేశ్ కనిపించనుండడంతో దీనిపై ఆసక్తి ఏర్పడింది.



# సిద్దూ సినిమా..ఓ రొమాంటిక్ డ్రామా

హీరోయిన్ శ్రీనిధిశెట్టి

కేజీఎఫ్ సినిమాతో హీరోయిన్‌గా బ్లాక్ బస్టర్ హిట్టందుకుంది శ్రీనిధి శెట్టి. తెలుగులో నానితో హిట్ 3లో కలిసి నటించింది. ఈ భామ ప్రస్తుతం సిద్దుజొన్నలగడ్డతో రొమాంటిక్ ఎంటర్‌టైనర్ తెలుసు కదా సినిమాలో నటిస్తుంది. ఈ మూవీ అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాలు షేర్ చేసుకుంది శ్రీనిధిశెట్టి. చిట్ చాట్ సెషన్‌లో శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ.. కేజీఎఫ్, హిట్ 3 లాంటి వయోలెన్స్, రక్తపాతం చుట్టూ తిరిగే సినిమాల తర్వాత సున్నిత భావోద్వేగాలతో సాగే సినిమా ఇది. ఈ మూవీ నాకు ఉత్తేజాన్ని కలిగించే మార్పులాంటిది. ఈ చిత్రాన్ని ప్రతీ ఒక్కరూ ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నానంది. తెలుసు కదా ప్రేమ, ఎమోషన్, నవ్వులు, అందమైన పాటలతో సాగే కమర్షియల్ సినిమా. ఈ సినిమా చూసిన తర్వాత మూవీ లవర్స్ ఒక అందమైన రొమాంటిక్ డ్రామాను చూసినట్టు ఫీల్ అవుతారంది శ్రీనిధి శెట్టి . సినిమాకు పనిచేయడం గురించి మాట్లాడుతూ.. నాకు డైరెక్టర్ నీరజ కోన, సిద్ధు, రాశీ ఖన్నాతో కలిసి నటించే అద్భుతమైన సమయం దొరికింది. నీరజ కోన చాలా సపోర్ట్‌గా నిలిచే వ్యక్తి. ప్రేక్షకులు ఖచ్చితంగా సిద్ధు పాత్రతో ప్రేమలో పడిపోతారు. అతడికి ప్రతీ విభాగంలో అద్భుతమైన ప్రావీణ్యం ఉంది. రాశీఖన్నా చాలా క్రమశిక్షణతో ఉండే వ్యక్తి అని చెప్పుకొచ్చింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి పనిచేయడం గొప్పగా భావిస్తున్నానంది. సినిమాల పట్ల ఎంతో ప్యాషన్ ఉన్న నిర్మాతలతో కలిసి పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానంది శ్రీనిధిశెట్టి.

# ఓ భారీ సినిమా కోసం కష్టపడుతున్నా

### అల్లుతో సినిమాపై అట్లీ కామెంట్స్



అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా గురించి అట్లీ ఓ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రేక్షకులు ఆశ్చర్యపోయే ప్రపంచాన్ని సృష్టించనున్నట్లు తెలిపారు. తాజాగా బెంగళూర్‌లో జరిగిన పికిల్‌బాల్ టోర్నమెంట్‌కు అట్లీ అతిథిగా హాజరయ్యారు. ఇందులో ఈ మూవీ గురించి మాట్లాడారు. 'ఏదైనా ఒక్క ఆలోచనతోనే ప్రారంభమవుతుంది. ఈ సినిమాతో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వడానికి మేం ప్రయత్నిస్తున్నాం. ఆడియన్స్ ఆశ్చర్యపోయేలా కొత్త ప్రపంచాన్ని సృష్టించనున్నాం. దేవుడు మా ప్రయాణంలో ప్రతి అడుగులోనూ తోడున్నాడు. ఆయన దయ వల్ల అంతా మేం అనుకున్నట్లే జరుగుతుందని ఆశిస్తున్నా. ఇంత భారీ ప్రాజెక్ట్‌ను రూపొందించడం రిస్క్‌గా అనుకోవడం లేదు. నేను దీన్ని ఎంజాయ్ చేస్తున్నా మరి కొన్ని నెలల్లో మీరు దీన్ని ఆస్వాదిస్తారని అట్లీ తెలిపారు. ఇక తాజాగా వచ్చిన 'కాంతార చాప్టర్ 1'పై అట్లీ ప్రశంసలు కురిపించారు. అదో అద్భుతమన్నారు. 'కాంతార 1'ను నేను మొదటి రోజు చూశాను. విదేశాల్లో ఉండడంతో థియేటర్‌కు వెళ్లడం కోసం దాదాపు రెండున్నర గంటలు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లాను. సినిమా చూడగానే రిషబ్‌కు ఫోన్ చేసి అభినందించా. నేను చాలా గౌరవించే వ్యక్తుల్లో రిషబ్ ఒకరు. నాకు మంచి స్నేహితుడు. ఇలాంటి సినిమాను రూపొందించడం ఎంత కష్టమో ఒక దర్శకుడిగా నాకు తెలుసు. రిషబ్ ఎంతోమందికి స్ఫూర్తి. ఆయన ఈ సినిమాతో మరో జాతీయ అవార్డు గెలుచుకోవాలని ఆశిస్తున్నానని అట్లీ తెలిపారు.

# ఎంగేజ్‌మెంట్..పెళ్లి వార్తలు.. అంతా సీక్రెట్

### ఎంగేజ్మెంట్ రింగులతో దర్శనమిస్తున్న రౌడీజంట



వారం రోజులుగా సోషల్ మీడియాను ఓ వార్త కుదిపేస్తోంది. రష్మిక, విజయ్ దేవరకొండ ఎంగేజ్ మెంట్ జరిగిందని.. ఫిబ్రవరిలో పెళ్లి అంటూ ఒకటే రూమర్లు. సోషల్ మీడియా నుంచి మెయిన్ స్ట్రీమ్ మీడియా వరకు ఇదే వైరల్ అవుతోంది. కానీ ఈ జంట మాత్రం సైలెంట్ గా ఉంటుంది. తమకు అసలు ఎంగేజ్ మెంట్ అయిందో లేదో అనే విషయంపై కూడా క్లారిటీ ఇవ్వట్లేదు. ఎలాంటి ఫొటోలు బయటకు రాకుండానే ఈ వార్తలు దేశ వ్యాప్తంగా వైరల్ అవుతున్నాయి. పెళ్లి విషయంలో ఎందుకు ఇంత సస్పెన్స్‌గా ఉంచుతున్నారో ఎవరికీ అర్థం కావట్లేదు. కనీసం తమ అభిమానుల కోసమైనా.. ఎంగేజ్ మెంట్ గురించి చెప్పొచ్చు కదా. అలా చెప్పకుండా ఎవరి సినిమాల్లో వారు బిజీగా ఉంటున్నారు. ఇన్ని రోజులు ప్రేమ విషయంలో ఎలాగూ సస్పెన్స్ మెయింటేన్ చేశారు. ఇప్పుడు ముఖ్యమైన పెళ్లి విషయంలో ఎందుకు ఇంత సీక్రెట్. వీళ్లు స్పందించికపోయేసరికి అసలు నిజంగా ఎంగేజ్ మెంట్ జరిగిందా లేదా అనే అనుమానాలు పెరుగుతున్నాయి. రకరకాల రూమర్లు వస్తున్నాయి. అక్టోబర్ 3న వీరి నిశ్చితార్థం జరిగిందని సన్నిహితులు వెల్లడించినట్లు వార్తలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా వీరిద్దరూ ఉంగరాలు పెట్టుకొని కనిపించడంతో వీరి ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. ఇటీవల విజయ్ దేవరకొండ పుట్టపర్తి వెళ్లారు. అక్కడ ఆయన చేతికి బంగారపు ఉంగరం కనిపించడంతో అందరూ అది ఎంగేజ్‌మెంట్ రింగ్ అంటూ ఫొటోలు షేర్ చేశారు. తాజాగా నేషనల్ క్రష్ రష్మిక తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టారు. తన అప్‌కమింగ్ సినిమా 'థామా'లోని 'నువ్వు నా సొంతమా' పాట గురించి అందులో రాసుకొచ్చారు. అందులో రష్మిక చేతికి వజ్రపు ఉంగరం కనిపించడంతో మరోసారి వీరి ఎంగేజ్‌మెంట్ వార్త వైరల్ అవుతోంది. వీరిద్దరూ కలిసి 'గీత గోవిందం'లో నటించి మంచి ఆన్‌స్క్రీన్ పెయిర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమా సూపర్‌హిట్‌గా నిలిచింది. దీని తర్వాత 'డియర్ కామ్రేడ్'తో అలరించారు.

# లక్‌కోసం ఎదురు చూస్తున్న కృతిశెట్టి



తొలి సినిమాతోనే తెలుగులో గ్రాండ్ సక్సెస్ అందుకున్న భామల్లో ఒకరు కృతిశెట్టి. ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. అద్భుతమైన నటనతో కుర్రకారు మనసు దోచేసిన కృతిశెట్టి ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంది. కానీ ఆ తర్వాత చేసిన సినిమాలు మాత్రం కృతిశెట్టికి నిరాశనే మిగిల్చాయని చెప్పాలి. కృతిశెట్టి హీరోయిన్‌గా నటించిన కస్టడీ, మనమే, ది వారియర్, మాచెర్ల నియోజకవర్గం సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఈ వరుస ఫెయిల్యూర్స్ టాలీవుడ్‌లో కృతిశెట్టి ప్రయాణంపై ప్రభావం చూపించాయి. అయితే ఇక చేసేదేమి లేక తమిళంలో తన లక్‌ను పరీక్షించుకోవాలనుకున్నకృతిశెట్టి అక్కడ మూడు సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాపులర్ యాక్టర్లతో సినిమాలు చేసి.. షూటింగ్స్ పూర్తి చేసినా పలు కారణాల వల్ల ఆలస్యమవుతూ వచ్చాయి. తీవ్ర నిరాశలో ఉండిపోయిన కృతిశెట్టి అభిమానుల కోసం వరుసగా ఆ సినిమాలు విడుదలకు రెడీ అయ్యాయి. పై మూడు సినిమాలు ఒకేసారి ఒకే నెలలో విడుదలకు ముస్తాబవుతున్నాయి. ఈ మూడు ప్రాజెక్టులు కూడా డిసెంబర్ నెలలోనే రిలీజ్ కాబోతుండటం విశేషం.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,